RNI NO : APTEL/2013/54450

నగరనిజం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్ ఫోన్‌కి చేయగలరు : ☎8247467562
Email Id : nagaranijam@gmail.com
Website : www.nagaranijam.com

# నగరనిజం

www.nagaranijam.com
అక్షరనిజం నగరనిజం
తెలుగు దిన పత్రిక

NN NEWS నగరనిజం

సంపుటి : 13 | సంచిక : 31 | రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 24 గురువారం,ఏప్రిల్,2025 | పేజీలు : 4+ | ₹3

Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

## జపాన్ దేశ పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌కు



హైదరాబాద్ / నగరనిజం : జపాన్ దేశ పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న ముఖ్యమంత్రి గారికి పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర ప్రతినిధులు స్వాగతం పలికారు.ముఖ్యమంత్రి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఈ నెల 16 నుంచి ఏడు రోజుల పాటు జపాన్ దేశంలో పర్యటించింది. ఈ పర్యటనలో రాష్ట్రానికి 12,062 కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించి వివిధ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. పలు రంగాల్లో సహకారం, సాంకేతిక భాగస్వామ్యం కోసం చర్చలు జరిపింది.

## భూభారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం

- భూభారతి చట్టంపై ప్రతి మండలంలో సదస్సులు
- ధరణి వెబ్ సైట్ స్థానంలో కొత్తగా భూభారతి వెబ్ సైట్
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి
- హయత్ నగర్ లో భూభారతి చట్టంపై సదస్సు




ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 23 ( నగరనిజం ) : భూభారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం జరుగుతుందని, భూభారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు.బుధవారం రంగారెడ్డి జిల్లా హయాత్ నగర్ ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో కలెక్టర్ నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భూ భారతి చట్టం-2025 ను ఈ నెల 14న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి నాడు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. చట్టంపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ధరణి స్థానంలో కొత్తగా భూభారతి (భూమి హక్కుల చట్టం) తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇందులో అన్ని రకాల అప్లికేషన్స్ ఉన్నాయని, హక్కుల రికార్డులలో తప్పుల సవరణ చేసుకోవచ్చని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని సూచించారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ, పాసు పుస్తకాలలో భూమి పటం, భూముల సమస్యలు పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్లపై లేదా జారీచేసిన పాసుపుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓకు అప్పీలు చేసుకోవచ్చని, ఆర్డీఓ ఇచ్చిన తీర్పుపై అభ్యంతరం ఉంటే జిల్లా కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. భూదార్ కార్డుల జారీ, రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ చట్టంలో ఏమైనా అభ్యంతరాలు, అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చని అన్నారు. సాదా బైనామాలు, వారసత్వంగా వచ్చిన భూములపై 30 రోజుల్లోగా విచారణ చేయడం జరుగుతుందని, ఒకవేళ అట్టి గడువులోగా విచారణ చేయని పక్షంలో రిజిస్ట్రేషన్ అయినట్లుగా భావించవచ్చని తెలిపారు. ప్రజలు ఈ చట్టం పై అవగాహన ఏర్పర్చుకోవాలని, వారికి ఉన్న భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం మే మొదటి వారం నుండి గ్రామాలలో సదస్సులు నిర్వహించేందుకు వచ్చే అధికారులకు అర్జీలు సమర్పించవచ్చని సూచించారు. అంతకుముందు సరూర్ నగర్ మున్సిపల్ వార్డులో నిర్వహించిన భూభారతి చట్టం-2025 అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొని రైతులకు భుభారతి చట్టంలోని కీలక అంశాల గురించి పవర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ధరణి సమయంలో రైతులు భూ సమస్యలకు చాలా ఇబ్బందులు పడేవారని అట్టి సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తెస్తే వారు ఏం చేయలేని పరిస్థితిలో ఉండేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్ఓఆర్ చట్టం భూభారతి చట్టం-2025 ద్వారా రైతులకు సులభతరమైన న్యాయమైన సేవలు అందిస్తామన్నారు. రెవెన్యూ సదస్సుకు హాజరైన రైతులు అడిగిన ప్రశ్నలకు అదనపు కలెక్టర్, కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు.ఈ సదస్సులలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, సరూర్ నగర్ మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, స్థానిక అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


## పహల్గామ్ టూరిస్టులపై కాల్పులు దుర్మార్గమైన చర్య

- జమ్ముకశ్మీర్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ కార్యదర్శి సామ మహేందర్ రెడ్డి



కందుకూరు,ఏప్రిల్ 23 (నగర నిజం) :కాశ్మీర్ ప్రాంతం లోని పహల్గామ్ పర్యాటక కేంద్రంలో ముష్కరులు జరిపిన నరమేధంలో 28 మంది ప్రాణాలు కోల్పోగా మరికొంతమంది చావు బతుకుల మధ్యలో కొట్టుమిట్టడం తనను కలచివేసిందని మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ కార్యదర్శి సామ మహేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం ఆయన మాట్లాడుతూ,ఉగ్రవాదులు మంచు కొండల్లో మారణ హెూమం సృష్టించారని,రోడ్డు మార్గం లేని ప్రాంతాన్ని ఎంచుకొని పహాల్గాం పర్యాటక కేంద్రంలో ఉన్న పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి పైశాచికా ఆనందం పొందారని ఆయన అన్నారు.గతంలో సైతం అమర్నాథ్ యాత్ర జరుగుతున్న నేపథ్యంలో యాత్రకు వెళ్లే యాత్రికులపై పలుమార్లు దాడి చేసిన ముష్కరులు ఊచకోత చేసిన ఘటనలు యావత్ భారతదేశం మర్చిపోలేదని ఆయన తెలిపారు.కాశ్మీర్ పర్యాటక కేంద్రంలో ఉగ్రవాదులు టూరిస్టుల ద్వారా వనరులు పెరుగుతున్న నేపథ్యంలో ఈఘటన జరగడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు.ఈ ఘటన తర్వాత అక్కడున్న వారి ఆదాయ వనరులు కొల్లగొట్టేందుకు ఉగ్రవాదులు పథకాలు రచించారని ఆయన మండిపడ్డారు.అమాయకులను చంపడం దుర్మార్గమని అన్నారు.మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.అమాయకులపై కాల్పులు జరపడం పిరికిపంద చర్య అని ఆయన అభివర్ణించారు.దేశ భద్రతకు విఘాతం కల్పించేందుకే ఇలాంటి దుచర్యలకు పాల్పద్దారని ఆయన ఆరోపించారు.జమ్ము-కాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి చాలా బాధాకరం,కాల్పుల్లో గాయాలైన వారు త్వరగా కోలుకోవాలని,మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని అందరం ప్రార్థిద్దామని ఆయన పిలుపునిచ్చారు.జమ్ము కాశ్మీర్లో టెర్రరిస్టుల మరణకాండ పురావృతం కాకుండా కేంద్రం ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పుస్తకావిష్కరణ సభ




ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 23 ( నగరనిజం ) : ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాధిక అధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణ సభలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రమేశ్ రచించిన భారత దేశ ఆర్థిక అభివృద్ధిలో పాలసీ విధానం, సవాళ్లు అనే అర్థశాస్త్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ... దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే అంశాన్ని డాక్టర్ రమేశ్ అందరికీ అర్థమయ్యే రీతిలో భారత దేశ ఆర్థిక అభివృద్ధి పాలసీ విధానాన్ని మరియు సవాళ్లను ఎంతో పరిశోధనాత్మకంగా రచించాడని కొనియాడారు. అంతేగాకుండా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేశ్ అనేక పాఠ్యాంశాలను ఓపెన్ ఇంటర్ కు, ఎం.ఏ. ఎకనామిక్స్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి పాఠ్యాంశాలను రచించి విద్యార్థుల అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడినాడని, పుస్తకరచన పట్ల అతనికున్న మక్కువకు ఈ పుస్తకాలే నిదర్శనమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలు రచించి ఎందరో విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ చింతల రాకేశ్ భవాని వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే సురేష్, అధ్యాపకులు డిఎస్ఎస్ఆర్ కృష్ణ, నరేందర్ రెడ్డి, డాక్టర్ మాధవి, రవికుమార్, డాక్టర్ డి.వి. రావు, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంధి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్ పద్మావతి



ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 23 ( నగరనిజం ) : ఇబ్రహీంపట్నం బస్ డిపోలో విధులు నిర్వర్తిస్తున్న ఆర్టీసీ కండక్టర్ పద్మావతి తమ నిజాయితీ చాటుకుంది. ఇబ్రహీంపట్నం డిపో మెట్రో డీలక్స్ 224 సర్వీస్ జేబీఎస్ నుండి ఇబ్రహీంపట్నం వస్తుండగా బస్సులో ప్రయాణం చేస్తున్న మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన అనిత తమ మొబైల్ ఫోన్ పోగొట్టుకుంది. ఇది గమనించిన కండక్టర్ పద్మావతి ఫోన్ లో ఉన్న నెంబర్స్ ద్వారా కనుక్కొని కంట్రోలర్ నరసింహ ఆధ్వర్యంలో బాధితురాలికి ఫోన్ అప్పజెప్పింధి. సుమారు ఫోన్ విలువ రూ.12 వేల విలువ ఉంటుంది. నిజాయితీ చాటుకున్న కండక్టర్ బాధితురాలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్టీసీ కండక్టర్ పద్మావతి నిజాయితీ పట్ల ఇబ్రహీంపట్నం నియోజకవర్గ వ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తాయి. ఆర్టీసీ ఉద్యోగులు, పలువురు కండక్టర్ పద్మావతినీ అభినందిస్తున్నారు. ఆమెను అభినందించిన వారిలో ఆర్టీసీ కానిస్టేబుల్ పద్మ, సిబ్బంది తదితరులున్నారు.

## అమరుల స్ఫూర్తితో 'మేడే 'ను జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్
- తుర్కయంజాల్ లో మేడే గోడపత్రిక ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 23 ( నగరనిజం ) : అమరుల స్ఫూర్తితో మేడే ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మేడే గోడ పత్రికను ఆవిష్కరించారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి.కిషన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐటియు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ మాట్లాడుతూ... కార్మికుల హక్కుల కోసం, కార్మిక చట్టాల అమలు కోసం అనాడు మేడే సందర్భంగా తమ విలువైన ప్రాణాలు త్యాగాలు చేసి అనేక మంది కార్మికులు రక్త తర్పణం గావించిన అమరవీరుల స్ఫూర్తితో కార్మిక పోరాటాలను ఉధృతం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని, వారాంతపు సేలవులను కాపాడుకోవాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను ఇటీవల కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి వాటి స్థానంలో తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్ లు కార్పొరేట్, పెట్టుబడుదారులు, పరిశ్రమల యాజమాన్యాలకు ప్రయోజనాలు చేకూర్చి కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకేనని కనుక 4 లేబర్ కోడ్ లను ఉపసంహరించుకునేంత వరకు కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. నేడు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం ప్రతి కార్మికుడికి రూ. 26 వేల రూపాయలు, ఇతర చట్టబద్ధమైన సౌకర్యాలు సాధించుకోవాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కనుక మేడే రోజున జిల్లా వ్యాప్తంగా కార్మిక వర్గం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, కార్మిక చట్టాలు ప్రజాస్వామ్య హక్కుల రక్షణ కోసం నిర్వహించే భారీ ప్రదర్శనలు బహిరంగ సభలో కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారూ. కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపల్ నాయకులు యం సత్యనారాయణ, బి మాల్యాద్రి, పీ శ్రీనివాసులు, కృష్ణ ఏ మాధవరెడ్డి, గుర్రం జంగయ్య, గనిపల్లి రాములు, ఆటో డ్రైవర్స్ నాయకులు జక్కా హనుమంత్ రెడ్డి, గుండా బాలరాజ్, బండ బీరప్ప, గుడ్ల రాజు, మధుకర్ రెడ్డి, యాదగిరి, రామకృష్ణారెడ్డి, దేవేందర్ రెడ్డి, నాగరాజు, వినోద్, మున్సిపల్ కార్మిక నాయకులు మేతరి దాసు, రవీందర్, యాదయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.౦

## చాకలిపల్లి పాఠశాలలో తల్లిదండ్రులు సమావేశం..



చౌడాపూర్ మండల ప్రతినిధి ఏప్రిల్ 23(నగర నిజం ):మండల పరిధిలోని చాకలిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ...వేసవి సెలవుల తర్వాత విద్యార్థులని మా ఊరు మన పాఠశాల కార్యక్రమం ఏర్పాటు చేసి గ్రామ విద్యార్థులందరు ప్రభుత్వ పాఠశాలకు వచ్చేవిధంగా చూసి ప్రవేటు పాఠశాలకు ఎవ్వరు పంపించకుండా మా ఊరు పాఠశాలకే పంపించాలని కోరడం జరిగింది.అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ సర్టిఫికెట్ పంపిణి చేయడం జరిగింది.ప్రధానోపాధ్యాయురాలు అరుణ, స్థానికమాజీ సర్పంచ్ శేఖర్,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గౌరమ్మ, చంద్రశేఖర్,ఉపాధ్యాయులు దత్తత్రేయ, శశికాంత్,విజయ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద వికలాంగుల కుటుంబాన్ని పరామర్శించిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్



ఖమ్మం: ఏప్రిల్ 23, ( నగర నిజం బ్యూరో ):ఖమ్మం : ఎదులాపురం మున్సిపాలిటీ, ఎదులాపురం పరిధిలోనీ వెంకటాద్రి నగర్ నందు నిరుపేద వికలాంగురాలు గత కొంత కాలం క్రితం కింద జారిపడి కాలు ఫ్రాక్చర్ అయి ఇబ్బంది పడుతున్న విషయం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్ దృష్టికి రాగ వెంటనే స్పందించి వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు.అలాగే వారికి వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లా వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చి మనోధైర్యం కల్పించారు.

# కందకట్ల సిద్దు రెడ్డి ఆదర్శప్రాయుడు

## - ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రశంస-

- కందకట్ల సిద్దు రెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్ రాజ్ మహల్ లో మెగా జాబ్ మేళా
- జాబ్ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- జాబ్ వేళాలో పాల్గొన్న వందకు పైగా కంపెనీలు
- మెగా జాబ్ మేళాకు తరలివచ్చిన 5000 మంది నిరుద్యోగులు
- దాదాపు 500 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆర్డర్లు పాస్ చేసిన వివిధ కంపెనీలు










రాజేంద్రనగర్, ఏప్రిల్ 23(నగరనిజం ప్రతినిధి):సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు అండగా నిలుస్తున్న కందకట్ల సిద్దు రెడ్డి అందరికీ ఆదర్శప్రాయుడని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రశంసలతో చెప్పారు. ఖర్చుకు వెనుకాడకుండా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ నిరుద్యోగ యువతకు వెన్ను దన్నుగా నిలుస్తున్న సిద్దు రెడ్డిని ఆయన అభినందించారు. మరోవైపు సామాజికవేత్త సిద్దు రెడ్డి అందిస్తున్న అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకొని జీవితంలో పైకి రావాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ యువతకు దిశా నిర్దేశం చేశారు.బుధవారం నాడు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాజ్ మహల్ ఫంక్షన్ హాల్ వేదికగా సామాజికవేత్త కందకట్ల సిద్దు రెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేరకు రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై జాబ్ మేళాను ప్రారంభించారు.శంషాబాద్ నుండే కాకుండా రాజేంద్రనగర్ నియోజకవర్గం సహా వివిధ ప్రాంతాల నుండి సుమారు 5000 మందికి పైగా నిరుద్యోగ యువత జాబ్ మేళాకు తరలివచ్చారు. వివిధ ఐటి సంస్థల తో పాటు నాన్ ఐటి సంస్థలకు చెందిన దాదాపు 100కు పైగా కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళాలో పాల్గొని అర్హులైన నిరుద్యోగ యువతను ఎంపిక చేసి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించారు. అక్కడికక్కడే స్పాట్ ఆఫర్లు మంజూరు చేశారు. సెలెక్ట్ అయిన యువతకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో పాటు కందకర్త సిద్దు రెడ్డి, మన్నన్ చేతుల మీదుగా నియామకపు పత్రాలు అందజేశారు. అయితే జాబ్ మేళాను పురస్కరించుకొని అందరికంటే ముందుగా ఉదయం 6 గంటలకే రాజ్ మహల్ వేదికకు చేరుకున్న అంగ వికలాంగురాలికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, సిద్దు రెడ్డి స్వయంగా దగ్గరికి వెళ్లి నియామకం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.... ఖర్చుకు వెనుకాడకుండా సమాజ హితం కోసం పాటుపడుతున్న కందకట్ల సిద్దు రెడ్డి సేవలను ప్రశంసించారు. సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూనే నిరుద్యోగ యువతను ఆదుకోవడానికి సిద్దు రెడ్డి చేస్తున్న కృషి అద్వితీయమన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ కందకట్ల సిద్దు రెడ్డిని ఆదర్శంగా తీసుకొని సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ప్రకాష్ గౌడ్ పిలుపునిచ్చారు. శంషాబాద్ వద్ద అతిపెద్ద జాబ్ మేళా నిర్వహించడం ద్వారా వందలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం పట్ల ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో ముందుకు వస్తే సమాజాన్ని ఇట్టే మార్చేయవచ్చునని ప్రకాష్ గౌడ్ అభిప్రాయపడ్డ.

### సిద్దు రెడ్డికి యువత జేజేలు

సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ నిరుద్యోగ యువతకు దారి చూపుతున్న సామాజికవేత్త కందగట్ల సిద్దు రెడ్డి పై యువత ప్రశంసల జల్లు కురిపించింది. ఉన్నత చదువులు చదివి ఉద్యోగ అవకాశాలు లభించక తల్ల డిల్లుతున్న తమకు సిద్దు రెడ్డి ఉపాధి అవకాశాలు కల్పించి అండగా నిలవడం పట్ల వారు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ సుష్మ మహేందర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు ఆర్ గణేష్ గుప్తా, కొడిగంటి చంద్రారెడ్డి, దూడల వెంకటేష్ గౌడ్, దేవరంపల్లి బుచ్చిరెడ్డి, పారేపల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# వరంగల్ సభకు భారీగా తరలి వెళ్ళాలి..

- బిఆర్ఎస్ పార్టీ యూవ నాయకుడు విక్కీ నాయక్..



చౌడాపూర్ మండల ప్రతినిధి ఏప్రిల్ 23 (నగరనిజం):చౌడాపూర్ మండలం నుండి భారీగా వరంగల్ సభ కు తరలి వెళ్లాలని బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు విక్కీ నాయక్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో,27 వ తేదీన బిఆర్ఎస్ పార్టీ నిర్వహించే భారీ బహిరంగ సభకు భారీగా తరలి వెళ్దాం.అని బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు విక్కీ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారీ బహిరంగ సభ నిర్వహించడంతో బిఆర్ఎస్ పార్టీనీ మించిన రాజకీయ పార్టీ లేదన్నారు,సిల్వర్ జూబ్లీ బహిరంగ సభకు కనీ,వినీ ఎరుగని రితిలో నిర్వహించేందుకు పార్టీ ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు.బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ ప్రసంగాన్ని వినేందుకు దేశంలోని రాజకీయ పార్టీల, నాయకులు, మేధావులు, ప్రజలు ఎంతోగానో,ఆసక్తిని చూపుతున్నారు అని వెల్లడించారు.పార్టీలకు అతీతంగా ప్రజలు,అభిమానులు, బహిరంగ సభకు తరలివచ్చి సభకు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# రైల్వే జనరల్ మేనేజర్‌ని కలిసిన ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి

- దంసలాపురం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి వినతి, హామీ ఇచ్చిన రైల్వే జి. యం



ఖమ్మం: ఏప్రిల్ 23, ( నగర నిజం బ్యూరో ) : ఖమ్మం : దంసలాపురం రైల్వే అండర్ బ్రిడ్జి, సర్వీస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి గతంలో సర్వే పూర్తయినప్పటికీ భూసేకరణకు నిధులు మంజూరు చేయకపోవడంతో అండర్ బ్రిడ్జి నిర్మాణం జరగపోవడంతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్న విషయమై ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి నిన్న ధంసలాపురం అండర్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు అండర్ బ్రిడ్జి, సర్వీస్ రోడ్డు నిర్మాణం, చేపట్టకపోవడంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని చెప్పారు. అట్టి విషయమై ఈరోజు సికింద్రాబాద్ రైల్వే జీఎం నీ కలిసి దంసలాపురం అండర్ బ్రిడ్జి, సర్వీస్ రోడ్డు నిర్మాణం భూసేకరణకు కొరకు నిధులు మంజూరు చేయాలని ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి కోరగా రైల్వే జీఎం సానుకూలంగా స్పందించిన నిధుల మంజూరు కి హామీ ఇవ్వడం జరిగింది.అదేవిధంగా ఈ సందర్భంగా గతం లో రద్దు చేసిన రైళ్లను తిరిగి పున:రుద్ధరించాలని ఖమ్మం, బోనకల్, ఎర్రుపాలెం మరయు డోర్నకల్ నుండి భద్రాచలం రోడ్డు వెళ్ళే మార్గంలో గాంధీనగర్ స్టేషన్ లో రైళ్లను నిలుపుదల చేయాలని రైల్వే జీఎంని కోరండం జరిగింది.

# తేళ్ల వారి వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్సీ మాజీ ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్



ఖమ్మం: ఏప్రిల్ 23, ( నగర నిజం బ్యూరో):ఖమ్మం జిల్లా, సింగరేణి మండలం, గేట్ కారేపల్లి కి చెందిన తేళ్ల శ్రీనివాసరావు మంజుల దంపతుల కుమారుడు తేళ్ల రవి వర్మ వివాహానికి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ మాజీ ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్.ఈ కార్యక్రమంలో ముత్యాల సత్యనారాయణ, మంగీలాల్, రావూరి శ్రీను ముత్యాల వెంకటప్పారావు అడపా పుల్లారావు బత్తుల శ్రీను బానోత్ రాందాస్ జూపల్లి రాము పిల్లి శ్రీనివాస్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్‌లో మూడవ చలివేంద్రం ఏర్పాటు







బి.ఎన్.రెడ్డి నగర్ / నగర నిజం: ప్రముఖ సామాజిక కార్యకర్త గద్దె విజయ్ నేత ఆధ్వర్యంలో బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్‌లోని ఎన్జీవోస్ కాలనీ బస్ స్టాప్ వద్ద మూడవ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి ఉష్ణత తీవ్రత పెరుగుతున్న తరుణంలో ప్రజలకు శీతల పానీయాలు అందించాలనే లక్ష్యంతో ముత్తూస్ జార్జ్ ఫౌండేషన్, హైదరాబాద్ వారి సహకారంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కూలింగ్ రిఫ్రిజిరేటర్ ద్వారా తాగునీరు, మజ్జిగ వంటి పానీయాలను అందుబాటులో ఉంచారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి చలివేంద్రాన్ని మజ్జిగతో ప్రారంభించారు. అలాగే డిపార్ట్మెంట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజగోపాల్, మేనేజర్ భవ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గత 18 సంవత్సరాలుగా బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్‌లో నిర్వహిస్తున్న చలివేంద్రాలకు వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ వారు నిరంతరం సహకారం అందిస్తున్నారని గద్దె విజయ్ నేత తెలిపారు. ప్రజల సేవే తనకు ప్రధానం అన్న ధ్యేయంతో టిడిపి కార్పొరేటర్ అభ్యర్థిగా పని చేస్తున్న విషయాన్ని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా వాటర్ వర్క్స్ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. విచ్చేసిన అతిథులకు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు పంపన్న వెంకటేశ్వరరావు, వి.వి.వి. సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, దశరథ్ నేత, అశోక్, వేణు, శ్రీనివాస్ నేత, మనీష్, ఉదయ్ రెడ్డి, ఆర్టీసీ సూపర్వైజర్ నిరంజన్, వాటర్ వర్క్స్ సూపర్వైజర్ అనిల్ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.చలివేంద్రం ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు తీసుకున్న ఈ చర్య స్థానికంగా ప్రశంసలు పొందుతోంది.

# సన్‌సిటీ , కోకాపేటలో తనిష్క్ రెండు కొత్త స్టోర్‌లప్రారంభం





హైదరాబాద్, ఏప్రిల్ 23 (నగర నిజం న్యూస్ ): టాటా హౌస్ నుండి భారతదేశపు అతిపెద్ద ఆభరణాల రిటైల్ బ్రాండ్ అయిన తనిష్క్, హైదరాబాద్‌లోని సన్‌సిటీ మరియు కోకాపేటలో తన గ్రాండ్ స్టోర్‌ను ప్రారంభించడంతో తన రిటైల్ పాదముద్రను విస్తరించింది.సన్‌సిటీ స్టోర్‌ను చీఫ్ పీపుల్ ఆఫీసర్ శ్రీ స్వదేశ్ కుమార్ బెహెరా మరియు రీజినల్ బిజినెస్ హెడ్ - సౌత్ శ్రీ అజయ్ ద్వివేది ప్రారంభించారు.రెండు కొత్త స్టోర్‌లు బంగారం, వజ్రాలు, కుందన్, పోల్కీ మరియు అత్యాధునికమైన డిజైన్‌లతో సహా అద్భుతమైన ఆభరణాల శ్రేణిని, అలాగే ప్రతి అభిరుచికి తగినట్లుగా ప్రత్యేకమైన వివాహ సేకరణను ప్రదర్శించాయి.దెబ్బై ఐదు వందల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న సన్‌సిటీ స్టోర్ మరియు ఎనభై ఐదు వందల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న కోకాపేట స్టోర్, అద్భుతమైన బంగారం, వజ్రాలు, కుందన్ మరియు పోల్కీలో విలక్షణమైన తనిష్క్ ఆభరణాల డిజైన్‌ల విస్తృత ఎంపికను అందిస్తుంది. దీనితో పాటు, ఈ స్టోర్ హిందూ వివాహ పవిత్ర అంశాల నుండి ప్రేరణ పొందిన 'డార్' (గాజు పొడితో పూత చేయబడిన ప్రత్యేకమైన మంగళసూత్రాలు) అందిస్తుంది. అంతేకాకుండా, ఈ స్టోర్‌లో దేవత మరియు ఆమె వివిధ రూపాల నుండి ప్రేరణ పొందిన ప్రత్యేకమైన వరమహాలక్ష్మి సేకరణ 'ఆర్ణ'(దేవతల రూపాలతో కూడి వున్న ఆభరణం) కూడా ఉంది.అదనంగా, ఈ స్టోర్ పురుషుల కోసం మాత్రమే ప్రత్యేకమైన ఆభరణాల శ్రేణి 'అవీర్'(రాజసం ఉట్టిపడేల) ను అందిస్తుంది, అలాగే తనిష్క్ యొక్క అంకితమైన వివాహ ఆభరణాల ఉప-బ్రాండ్ 'రివా'(సంప్రదాయమైన సేకరణ ) నుండి అద్భుతమైన ఆభరణాలను అందిస్తుంది. భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుండి మహిళల ఫ్యాషన్ ప్రాధాన్యతలకు అనుగుణంగా రివాహ్ జాగ్రత్తగా రూపొందించబడింది మరియు వివాహ షాపింగ్ కోసం ఒక-స్టాప్ గమ్యస్థానంగా అభివృద్ధి చెందింది.ఈ గ్రాండ్ ప్రారంభోత్సవంలో భాగంగా, బ్రాండ్ ఒక అద్భుతమైన ఆఫర్‌ను అందిస్తోంది, దీనిలో వినియోగదారులు ప్రతి కొనుగోలుపై ఉచిత బంగారు నాణెం పొందవచ్చులి. ఈ ఆఫర్ 2025 ఏప్రిల్ 23 నుండి ఏప్రిల్ 25 వరకు చెల్లుతుంది.ప్రారంభోత్సవం సందర్భంగా సౌత్ రీజినల్ బిజినెస్ హెడ్ శ్రీ అజయ్ ద్వివేది మాట్లాడుతూ, "భారతదేశంలో అత్యంత ప్రియమైన ఆభరణాల బ్రాండ్లలో ఒకటిగా, తనిష్క్ మా కస్టమర్లకు అసాధారణమైన సేవలను అందించడానికి అంకితభావంతో ఉందని తెలిపారు.అన్ని తనిష్క్ స్టోర్లలో కారట్‌మీటర్ అమర్చబడి ఉంటుంది, ఇది కస్టమర్లు తమ బంగారం స్వచ్ఛతను అత్యంత సమర్థవంతంగా తనిఖీ చేయడానికి వీలు కల్పిస్తుంది. తనిష్క్ రిటైల్ చైన్ ప్రస్తుతం 300 కంటే ఎక్కువ నగరాల్లో 500ం ప్రత్యేకమైన బోటిక్‌లలో విస్తరించి ఉందని పత్రికా సమావేశంలో పేర్కొన్నారు.

# "పహెల్గావ్ పాఠం: భారత మార్కెట్ పై కుట్రనా?

● భారత సుదర్శన్,సామాజిక, రాజకీయ విశ్లేషకులు



హైదరాబాద్ ఏప్రిల్ 23 (నగర నిజం న్యూస్ )ఇటీవల మన దేశంలో రెండు ప్రధాన సంఘటనలు జరిగాయి..ఒకటి అమెరికాలో ఉగ్రవాద సంబంధాలపై అరెస్ట్ అయిన వ్యక్తిని (రాణా) భారతదేశానికి ప్రేత్యేక చర్యల ద్వారా తీసుకురావడం. రెండోది మత సంబంధ చట్టం'ను తీసుకురావడం. ఇలాంటి ముఖ్యమైన రెండు సంఘటనలు జరుగుతాయని ముందే తెలిసినప్పుడు భారత్ ప్రభుత్వం మరింత అప్రమత్తంగా ఉండాల్సి ఉండె. అయితే, ఉగ్రవాద విషవలయం అత్యంత ప్రమాదకరమైనది..ఒక ఆకారం లేని విస్తృత పరిధిని కలిగి ఉంది.దశాబ్ధాలు, శతాబ్ధాలుగా ఉగ్రవాదంపై పోరుచేస్తున్న అగ్రదేశాలు, అత్యంత సాంకేతిక రంగ దేశాలు కూడా ఇప్పటివరకూ ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేయలేకపోయాయి. ప్రపంచంలోనే అత్యంత నిఘా దేశాల్లో ఒకటైన ఇజ్రాయెల్ కూడా ఇటీవల కాలంలో తీవ్ర విషాదాన్ని మూటగట్టుకుంది.పహెల్గావ్ ఉగ్రదాడి అత్యంత పాశవికమైనదే. ఇదే సంఘటన అమెరికా, చైనా లేదా ఇజ్రాయెల్ లోనో జరిగివుంటే ఉగ్రరూపలపై విరుచకపడేవి. ఇజ్రాయెల్ తన భద్రత విషయంలో తీసుకునే చర్యలు గమనార్హమైనవే. ఇప్పుడు భారత్ కూడా ఏం చేయబోతున్నదనేది ముఖ్యమైన అంశం. పై దేశాల మాదిరిగా చేయాలనేది భారత్ విధానం కానప్పటికీ దేశ ప్రజల భద్రతకు రాజీపడేతత్వం భారత్ కు, భారతీయులకూ ఏమాత్రం లేదు..ఉండదు. ప్రస్తుతం భారత్ లో జరిగిన దాడులకు ప్రపంచ ఆర్థిక రాజకీయాలకు ఏమైనా సంబంధము ఉన్నదో అనే కోణంలో కూడా అన్వేషించాలి. అగ్ర రాజ్యాల దేశాల ఆర్థిక వ్యవస్థ మునుపెన్నడూ లేనివిధంగా తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కోవడం, శత్రుత్వ లేదా మిత్రుత్వ రూపంలో ఉన్న వాణిజ్య పోటీ దేశాల చూపు కూడా ఇప్పుడు భారత్ విస్తృత మార్కెట్ పై ఉంది. ఇక్కడ అభద్రతా పరిస్థితులను సృష్టించడం ద్వారా వ్యాపార, వాణిజ్య ప్రయోజనాలను పొందేందుకు కొన్ని దేశాలు కుయుక్తులకు పాల్పడే అవకాశం కూడా లేకపోలేదు. ఏది ఏమైనా భారత్ అప్రమత్తంగా ఉండి మన అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థ మార్కెట్ ను మరింత పటిష్టం చేసుకోవాలి. అంతేకాదు భారతావని బదులు తీర్చుకోవడమే కాదు ఉగ్రమూలాల్ని కూకటివేళ్లతో సహా నిర్మూలించి వసుధైక కుటుంబానికి కేంద్రస్థానం కావాలి. భద్రతకు రాజీపడని భారత్, న్యాయం కోసం నిలబడే భారత్ ఇదే మన తీరూ, దీక్ష. జై భారత్!

# నృసింహుని సన్నిధిలో ఉచిత వృద్ధాశ్రమం

● సర్కారుకు యాదగిరిగుట్ట టాస్కా విజ్ఞప్తి

● సైదాపురం, మైలారుగూడెంలలో టాస్కా బృందం ప్రచారం



యాదగిరిగుట్ట ఏప్రిల్ 23 (నగర నిజం న్యూస్ ): ప్రసిద్ధ పుణ్యక్షేత్ర పట్టణమైన యాదగిరిగుట్టలో 100 పడకల ఉచిత వృద్ధాశ్రమం నిర్మించాలని యాదగిరిగుట్ట మండల టాస్కా (తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్) అధ్యక్షకార్యదర్శులు ముదుంబై జయ మోహనా చార్య, పులుగం చక్రపాణి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని సైదాపురం, మైలారుగూడెం గ్రామాలలో టాస్కా బృంద సభ్యులతో కలిసి ప్రచారం చేపట్టారు. చట్ట పరంగా వున్న హక్కులు, ప్రభుత్వాలు కల్పిస్తున్న పథకాలు, ప్రయోజనాలపై రూపొందించిన ఫ్లెక్సీలను ఆయా గ్రామ వృద్ధులతో కలిసి ఆవిష్కరించారు.మైలారు గూడెం గ్రామ ఫ్లెక్సీ ఆవిష్కరణలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సీసా అశోక్, నూకల సుధాకర్ రెడ్డి, గౌడ యాదగిరి, రంగ కృష్ణ, సూరపల్లి నరసింహ, జీడిపల్లి సుధాకర్ రెడ్డి, బండి ముత్యం తదితరులు పాల్గొన్నారు.సైదాపురం గ్రామంలో పలు చోట్ల టాస్కా పోస్టర్లను అతికించారు. శిఖ శ్రీనివాస్, రాపోలు రామలింగారెడ్డి, గంధమల్ల కిష్టయ్య, జీ స్వామి తదితరులు పాల్గొన్నారు.టాస్కా ప్రచార బృందంలో నూకల సుధాకర్ రెడ్డి, డాక్టర్ రాగి సహదేవ్, గుండ్లపల్లి మల్లేశం గౌడ్, గుంటి యాదగిరి తదితరులు ఉన్నారు.

# డాక్టర్ సంగీత కు విలియం షేక్స్పియర్ ఎక్సెలెన్సీ అవార్డు 2025 ప్రధానం



హైదరాబాద్ ఏప్రిల్ 23 (నగర నిజం న్యూస్ ) విలియం షేక్స్పియర్ రచనలు ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా చదువుతారని, విశ్లేషిస్తారని ఉస్మానియా యూనివర్సిటీ ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ మాజీ అధిపతి ప్రొఫెసర్ ఏ కరుణాకర్ అన్నారు. బుధవారం ప్రపంచ ఆంగ్లభాష దినోత్సవ మరియు విలియం షేక్స్పియర్ జయంతిని పురస్కరించుకొని కింగ్ కోటి లోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ మరియు పీజీ కళాశాల ఆడిటోరియంలో వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. షేక్స్పియర్ ఒక ఆంగ్ల నాటక రచయిత, కవి మరియు నటుడు అతను ఆంగ్ల భాషలో గొప్ప రచయితగా మరియు ప్రపంచంలోని ప్రముఖ నాటక రచయితగా విస్తృతంగా పరి గణించబడ్డాడని అన్నారు. వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ కె రామ్ గోపాల్ రెడ్డి గత 25 సంవత్సరాలుగా ప్రజా సంక్షేమ అభివృద్ధి కొరకు నిరంతరం ఉచిత సేవలందిస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త మరియు గత 25 సంవత్సరాలుగా ఆంగ్లభాషలో కళాశాల ఆంగ్లభాషాధిపతిగా, సాహితివేత్తగా సేవలందిస్తున్న డాక్టర్ ఎం సంగీతను ఈ ఏడాది విలియం షేక్స్పియర్ ఎక్సెలెన్సీ అవార్డు 2025 ను ముఖ్య అతిధి శాలువా, జ్ఞాపిక, పూలమాల మరియు ప్రశంసాపత్రంతో ఘనంగా సన్మానించి అవార్డును ప్రధానం. ఈ సందర్భంగా తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్, కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ ఆందోని సాగయ్య రాజా, జి నవీన్ కుమార్, డాక్టర్ అనగా జాయిన్, శ్రీ పర్ల దాస్, డాక్టర్ సింధు వర్క్క,ఫాదర్ మారేటి తదితరులు పాల్గొని ప్రసంగించి డాక్టర్ సంగీతకు శుభాకాంక్షలు తెలిపారు.

# స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం చేసిన ప్రిన్సిపాల్ విష్ణు ప్రియ




కందుకూరు,ఏప్రిల్ 23 (నగర నిజం) : ఇంటర్మీడియట్ ఫలితాలలో మోడల్ స్కూల్ జూనియర్ కాలేజ్ నేదునూరు కందుకూరు మండలం విద్యార్థుల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలలో ప్రతిభ కనబర్చిన నేదునూరు మోడల్ స్కూల్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు విజయ దుందుభి మోగించడంతోబుధవారం పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ లో స్టేట్ ర్యాంకు, డిస్టిక్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ విష్ణు ప్రియ సన్మానించారు. బైపిసి ద్వితీయ సంవత్సరంలో ముస్కాన్ 992,జి.రమ్య శ్రీ 987,జి.పూజిత 979.ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో పి. తేజస్విని 954,జే.రమ్య 883,బి.నవ్య 883,సిఈసి ద్వితీయ సంవత్సరంలో ఏ.అశ్విని 902,ఎ.సందీప్833,ఏ.అక్షిత 833 మార్కులు ఎంపిసి ప్రథమ సంవత్సరంలో ఐ.అక్షిత 455,కే.శివనందిని 452,యం. సింధుజ 445 మార్కులుబైపిసి ప్రథమ సంవత్సరంలో బి.కావ్య 417,ఇష్రత్ 391,కె.దివ్య 377 మార్కులుసిఈసి ప్రథమ సంవత్సరంలో ఎస్.ఝాన్సీ 464,జె.దివ్య 455,ఎండి.అసిస్ బేగం 442 మొదలగు విద్యార్థులందరినీ ప్రిన్సిపాల్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ విష్ణు ప్రియ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి,జిల్లా స్థాయిలో నేదునూరు మోడల్ స్కూల్ ఉండడం చాలా సంతోషమని,భవిష్యత్ జీవితంలో కూడా ఇంకా ఎన్నో మంచి ఫలితాలు సాధిస్తూ, నీట్,ఎంసెట్ లో కూడా మావిద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారని విద్యార్థులను ప్రోత్సహించారు.అందుకు సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. నిరంతరం విద్యార్థులు పర్యవేక్షిస్తూ,శిక్షణ ఇచ్చినటువంటి ఉపాధ్యాయ బృందానికి ధన్యవాదాలు తెలిపారు.ఇక ముందు కూడ మంచి ఫలితాలు సాధిస్తామని రాష్ట్రంలోనే ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాల కళాశాలగా నిలబెడతామని తల్లిదండ్రులకు ఆమె హామీ ఇచ్చారు.ఉపాధ్యాయులందరు మాట్లాడుతూ,ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు ఇకముందు కూడా మంచి ఫలితాలు సాధించాలని వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ,మంచి ఫలితాలు సాధించినందుకు ప్రిన్సిపల్ కు, ఉపాధ్యాయ బృందానికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# నూతన రెవెన్యూ చట్టం- భూభారతి చట్టం-2025 పై అవగాహన సదస్సుకు మొయినాబాద్ ఎం.ఆర్.ఓ. గౌతమ్ కుమార్ ఆహ్వానం





మొయినాబాద్, 23 (నగర నిజం) 24.04.2025 మధ్యాహ్నం 12.30 గంటలకు మొయినాబాద్ నుండి సురంగల్ వెళ్లే దారిలో గల స్టార్ కన్వెన్షన్ హాల్ లో నూతన రెవెన్యూ చట్టం- భూభారతి చట్టం-2025 పై అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుంది.ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ,జిల్లా కలెక్టర్ నారాయణ్ రెడ్డి ఐఏఎస్ మరియు ఇతర ప్రముఖులు విచ్చేయుచున్నారు కావున మొయినాబాద్ మండల ప్రజలు,ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రైతులు, వివిధ సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు మరియు సిబ్బంది మరియు మీడియా ప్రతినిధులు ఇట్టి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేయుచున్నాం.మధ్యాహ్నం భోజనం(లంచ్ )ఏర్పాటు చేయనైనది.

# యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలి

● కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

● ఆరుట్లలో జీవన్ డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం



ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 23 ( నగరనిజం ) : యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి చెందిన పంబాల జీవన్ ఏర్పాటు చేసిన జీవన్ డయాగ్నోస్టిక్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత చెడు వ్యసనాల బారిన పడకుండా సన్మార్గంలో నడవాలని సమయాన్ని వృధా చేయకుండా సరైన మార్గాన్ని ఎంచుకొని ఆ రంగంలో ఉన్నతంగా ఎదగాలని అన్నారు. యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ఆకాంక్షించారు. స్వయం కృషితో ఎదిగి నలుగురికి ఆదర్శంగా నిలవాలని కోరారు. యువత స్వయం కృషితో ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం జీవన్ ను ఆయన అభినందించారు. అనంతరం డయాగ్నొస్టిక్ సెంటర్ నిర్వాహకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, మార సురేష్, పంబాల బుగ్గరాములు, బుట్టి కృష్ణ, యూత్ కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు వెదిరే సికిందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు దాసరమోని అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలి

● పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన పౌరులకు ఘన నివాళి



హైదరాబాద్ ఏప్రిల్ 23 (నగరనిజం న్యూస్ )ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. రామాంజనేలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన పౌరులకు ఘన నివాళి అర్పించారు.ఈ సందర్భంగా రామాంజనేలు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంతో, నిండు పర్యావరణంతో ఆహ్లాదాన్ని పంచే కాశ్మీర్ లోయలోని పహల్గాం ప్రాంతంలో పర్యాటక దేశ పౌరులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా తుపాకులతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఉగ్ర దాడిలో మృతి చెందిన దేశ పౌరులకు ఘన నివాళులు అర్పిస్తున్నానని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నానని ఒక ప్రకటనలో తెలిపారు పహల్గాం ఉగ్రదాడి ఘటన నన్ను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ఉగ్రదాడిలో 27 మంది సామాన్య పౌరులు చనిపోవడం అత్యంత బాధాకరమైన, విషాదకరమైన సంఘటన అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం శాంతితో, ప్రశాంత వాతావరణం ఉన్న దేశంలో ఉగ్రవాదులు అశాంతిని నెలకొల్పేందుకు కుట్రలు చేయడం మంచి పరిణామం కాదని, అశాంతిని నెలకొల్పేందుకు ప్రయత్నిస్తే దేశ పౌరులు ఊరుకునే స్థితిలో లేరని హెచ్చరించారు. దేశంలోని సమస్యాత్మక ప్రాంతాలలో కట్టుదిట్టమైన భద్రతను కల్పించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# విద్యాభివృద్ధితో పాటు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలి చైతన్య డిమ్డ్ టూబీ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి



మొయినాబాద్,23(నగర నిజం): విద్యాపట్టాలు అందరూ పొందగలుగుతారు విద్యా పట్టాలతో పాటు సమాజ సేవలో పాలుపంచుకున్నప్పుడే వారికి గుర్తింపు లభిస్తుందని చైతన్య డిమ్ టూబీ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. హిమాయత్నగర్ పరిధిలోని చైతన్య డిమ్డ్ టూబీ యూనివర్సిటీ ఫార్మసి విభాగంలో సాయిలక్ష్మీ పల్లా వీహెచ్ఎ పట్టా పొందారు. ఈ సందర్భంగా పిహెచ్ఎలో డిజైన్ సింధాసిస్ అండ్ పాసిబుల్ బయాలజికల్ ఎవల్యూషన్ ఆఫ్ నోవెల్ 1.4 బెంజోకన్జంక్షన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధన పత్రానికి సాయిలక్ష్మీ పల్లాకు వీహెచ్ఎ లభించింది. ప్రొఫెసర్ పులిగుల్ల శంకరయ్య పర్యవేక్షణలో సాయిలక్ష్మీ పల్లా పరిశోధన చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఛాన్సలర్ పురుషోత్తంరెడ్డి చేతుల మీదుగా ఆమెకు బుధవారం విహెచ్ పట్టా కార్యక్రమాన్ని నిర్వహించి అందజేశారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ ఫార్మసి విభాగంలో దేశానికి సేవ చేయడం ఎంతో అభినందనీయమన్నారు. పట్టాలు పొందడం ఎంతో అవసరం ఉన్నా సమాజ సేవ కోసం కృషి చేయడం అంతే అవసరమన్నారు. దేశానికి పరిశోధనలు ఎంతో కీలకమైనవని మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త టెక్నాలజీతో పరిశోధనలు నిర్వహించి సమాజానికి ఉపయోగపడేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొఫెసర్ డైరెక్టర్ సువర్ణదేవి, అడ్మినిస్ట్రేషన్ అధికారి సాత్వికరెడ్డి, వైస్ ఛాన్సలర్ శంకర్ లింగం, రిజిస్ట్రార్ రవీందర్, రిసర్చ్ డీన్ ఆచార్య కిష్టఫర్, రాజేందర్రెడ్డి, జగదీష్కుమార్, శంకరయ్య, కుమారస్వామి, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో మెరిసిన పేదింటి విద్యాకుసుమం రమ్య



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 23 నగర నిజం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నాడు విడుదలైన ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో పూడూరు మండలం, కంకల్ గ్రామానికి చెందిన ఉవ్వగుంట రమ్య 950 మార్కులు సాధించి గ్రామానికి ఆదర్శంగా నిలిచింది.రమ్య తండ్రి అంజయ్య చిన్నపాటి వ్యవసాయం చేస్తూ పిల్లలను చదివిస్తున్నాడు. రమ్య 2023వరకు కంకల్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివి పబ్లిక్ పరీక్షలలో మండల టాపర్ గా నిలిచింది.ఇంటర్ చేవెళ్ల ప్రభుత్వ బీసీ రెసిడెన్షియల్ కాలేజీ లో సీటు సాధించి ప్రైవేట్ కాలేజిలతో పోటి పడుతూ 950 మార్కులు సాధించి ప్రభుత్వ కాలేజి ల్లో చదివే వారందరికీ ఆదర్శంగా నిలిచింది.విద్యార్థిని రమ్య మాట్లాడుతూ 950 మార్కులు రావడం చాలా సంతోషంగా ఉందని అలాగే తల్లిదండ్రుల నమ్మకం మరియు ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఉండడం వల్లే తను బాగా చదుతున్నానని తెలిపింది.

# ఉన్నత చదువులు చదివి ఖాళీగా కూర్చోవద్దు

## -సామాజికవేత్త కందకట్ల సిద్దురెడ్డి-

- తల్లి బుచ్చమ్మకు పాదాభివందనం చేస్తున్నట్లు ప్రకటించిన సిద్దు రెడ్డి
- నిరుద్యోగులకు ప్లాట్ ఫామ్ క్రియేట్ చేయడమే లక్ష్యమని ప్రకటించిన కందకట్ల







రాజేంద్రనగర్, ఏప్రిల్ 23(నగరనిజం ప్రతినిధి):ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లభించక ఇళ్ల వద్ద ఖాళీగా కూర్చునే యువతకు కందకట్ల సిద్దు రెడ్డి గీతోపదేశం చేశారు. ఉన్నత చదువులు చదివాం.... తమ అర్హతకు తగ్గట్టు ఫలానా ఉద్యోగం వస్తేనే చేస్తాం అంటూ మొండి పట్టుదలకు పోకుండా కుటుంబ బాధ్యతలు గుర్తించి అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సిద్దు రెడ్డి నిరుద్యోగ యువతకు దిశా నిర్దేశం చేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధి లోని రాజ్ మహల్ ఫంక్షన్ హాల్ వేదికగా మన్నన్ గ్రూప్ సహకారంతో ప్రముఖ సామాజికవేత్త కందకట్ల సిద్దు రెడ్డి మెగా జాబ్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కందకట్ల....చిన్ననాటి నుండి తాను ఎన్నో కష్టాలను ఎదుర్కొని జీవితంలో పైకి వచ్చినట్లు వివరించారు. తన తల్లి కందకట్ల బుచ్చమ్మ కూరగాయలు అమ్మడం ద్వారా సర్కారు బడిలో తనను చదివించడానికి ఎన్నో కష్టాలు పడిందని సిద్దు రెడ్డి మరోసారి గుర్తు చేసుకున్నారు. తన తల్లి బుచ్చమ్మ ఆశీర్వాదంతో తాను జీవితంలో నిలదొక్కుకున్నానని ఆయన వివరించారు. సొంత లాభం కొంత మానుకో అన్న చందంగా పదిమందికి సాయపడేలా తన జీవితాన్ని తీర్చిదిద్దిన తల్లి బుచ్చమ్మకు పాదాభివందనం చేస్తున్నట్లు సిద్దు రెడ్డి ప్రకటించారు. డబ్బులు సంపాదించడం గొప్ప కాదని, సంపాదించిన దాంట్లో ఎంతో కొంత సమాజ సేవ కోసం ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. తనలాగా సామాజిక సేవ చేయాలని తపన చాలామందికి ఉంటుందని, అలాంటివారు తనతో కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.సామాజిక సేవాభావం ఉన్న ప్రతి ఒక్కరూ తనలాగా ముందుకు వచ్చి సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తే బాగుంటుందని సిద్దు రెడ్డి అభిప్రాయ పడ్డారు. తనకు జన్మనిచ్చిన శంషాబాద్ ప్రాంత రుణం తీర్చుకోవాలన్నదే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే హైటెక్ సిటీ నుండి మొదలుకొని హైదరాబాద్ జంట నగరాల్లో పలుచోట్ల నిరుద్యోగుల కోసం మెగా జాబ్ మేళా నిర్వహించడం జరిగిందన్నారు.అదేవిధంగా పొట్టకూటి కోసం ఎడారి దేశాలకు వెళ్తున్న వారి కోసం దుబాయిలో సైతం మెగా జాబ్ మేళా నిర్వహించడం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందని, ఇందుకు మన్నన్ గ్రూప్ సంస్థ అందిస్తున్న సహకారం మరువలేనిదని సిద్దు రెడ్డి ప్రకటించారు. తాజాగా తాను పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవడానికి శంషాబాద్ ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మన్నన్ గ్రూప్ సహకారంతో రాజ్ మహల్ లో మెగా జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని కందకట్ల సిద్దు రెడ్డి వెల్లడించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాన్ని పోషించుకోవాలని పిలుపునిచ్చారు. చాలామంది యువత ఉన్నత చదువులు చదివాము, చదువులకు తగ్గట్టు జాబులు రావాలని ఎదురు చూస్తూ స్తబ్దంగా ఉంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదువుకున్న యువత అవకాశాల కోసం వెతుక్కోవాలి తప్ప ఇంట్లో కూర్చుంటే అవకాశాలు రావని నిరుద్యోగ యువత కు సిద్దు రెడ్డి గీతోపదేశం చేశారు. మనం ఎంత దూరం ప్రయాణించాలన్నా అది తొలి అడుగుతోనే సాధ్యమవుతుందని, అందువల్ల వేసే మొదటి అడుగును జాగ్రత్తగా వేయాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలకు సంబంధించి తనకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కందకట్ల సిద్దు రెడ్డి పేరుపేరునా కృతజ్ఞతలు చెప్పారు.

# కాశ్మీర్లో హిందూ పర్యాటకులపై దాడిని ఖండిస్తూ బిజెపి కొవ్వొత్తుల ర్యాలీ

- దాడిని ఖండించని వివిధ పార్టీల నాయకులను కార్యకర్తలు నిలదీయండి
- దేశానికి వ్యతిరేకంగా ఉండే నాయకులు పద్ధతి మార్చుకోవాలని బీజేపీ డిమాండ్





చౌటుప్పల్ ఏప్రిల్ 24 (నగర నిజం) : జమ్మూ కాశ్మీర్ పహల్గాం లో హిందూ పర్యాటకులపై దాడిని ఖండిస్తూ భారతీయ జనతా పార్టీ మున్సిపల్, మండల శాఖ ఆధ్వర్యంలో నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీతో పాటు పాకిస్తాన్ జెండాని దహనం చేయడం జరిగింది.పాకిస్తాన్ ఉగ్రవాదులకు మద్దతుగా నిలిచిన ఏ ఒక్కరిని ఏ ఒక్క దేశాన్ని వదిలిపెట్టొద్దని నరేంద్ర మోడీ కి తెలియజేయడమైనది.ఈ దేశంలో ఉన్న పాకిస్తాన్ ప్రేమికులు ఈ దేశాన్ని వదిలి వెళ్లాలని బిజెపి డిమాండ్ చేస్తుంది.ఈ దేశంలో ఉంటూ అన్ని అనుభవిస్తూ వివిధ పార్టీలో ఉన్న నాయకులు దేశాన్ని వ్యతిరేకించే నాయకులు తక్షణమే ఈ దేశం వదిలిపెట్టాలని భారతీయ జనతా పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.ఇలాంటి సంఘటన జరిగినప్పుడు కూడా కుటుంబాలకు గాని దేశానికి గాని సానుభూతి అలాగే భద్రతా విషయంలో మద్దతు తెలిపే విషయం వదిలిపెట్టి వైఫల్యాలను ఎండగడుతూ పాకిస్తాన్ కి మద్దతుగా హిందూ వ్యతిరేకులుగా ఉండి తప్పులు దేవులాడే వ్యక్తులు నాయకులు పద్ధతి మార్చుకోవాలని బిజెపి డిమాండ్ చేస్తుంది. ప్రతిపక్ష నాయకుడు విదేశాలలో ఉన్నప్పుడు ప్రతిసారి ఇలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మైనార్టీ పేద కుటుంబాల గురించి ఏనాడు ఆలోచించలేని పార్టీలు నేడు ముస్లిం మైనార్టీ లోని అత్యధిక పేద కుటుంబాల అభివృద్ధి గురించి తీసుకునే నిర్ణయాలు సవరణ బిల్లును జీర్ణించుకోలేని వివిధ పార్టీల నాయకులు దేశంలో ఉగ్రవాదులకు మద్దతుగా నిలిచి హిందువుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న తీరును భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది.ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు భారతీయులకు భారతదేశంలో ఉన్న అన్ని మతాల వారికి ముఖ్యంగా హిందువులకు మద్దతుగా నిలవని పార్టీల నాయకులని స్థానికంగా ఉన్న వివిధ పార్టీల నాయక కార్యకర్తలు వాళ్ళ నాయకులను నిలదీయాలని బిజెపి డిమాండ్ చేస్తుంది.మన కుటుంబం వరకు మన వరకు వస్తేనే ప్రమాదం కాదు ఇప్పటికే ఆరు రాష్ట్రాలు కాంగ్రెస్ పుణ్యమా అని దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్న హిందూమతం అక్కడ మైనార్టీలుగా మారిపోయాం. ఇలాగనే ఉంటే మరో 20 సంవత్సరాల్లో మన పరిస్థితి ఏందో అర్థం చేసుకోవాలి మేలుకో భారతీయుడా హిందువుడా ఇకనైనా మేలుకో జాగృతం అవుదాం జాతి నిర్మాణాన్ని ఏకం చేద్దామని పిలుపునిచ్చారు. కాశ్మీర్లో ఉగ్రవాదులు దాడిలో మరణించిన హిందూ బంధువులకు నివాళులర్పిస్తూ పాకిస్తాన్ ఉగ్రవాద ప్రేరేపిత లష్కరే తోయిబా సంస్థ ను అంతం చేయాలని భగవంతుని వేడుకుంటూ పాకిస్తాన్ జాతీయ పతాకాన్ని దగ్ధం చేయడమైనది.ఈ కార్యక్రమంలో దూడల బిక్షం గౌడ్, రమణ గోని శంకర్, కడారి కల్పన, కైరం కొండ అశోక్,గుజ్జుల సురేందర్ రెడ్డి,కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ముత్యాల భూపాల్ రెడ్డి, బాతరాజు సత్యం, వెంకటేశం గౌడ్,ఊడుగు యాదయ్య గౌడ్,ఆలే చిరంజీవి,ఉబ్బు బుచ్చయ్య, తడక సురేఖ, కట్ట కృష్ణ,కడారి ఐలయ్య, ఊడుగు విజయలక్ష్మి, షాగ చంద్రశేఖర్ రెడ్డి,దిండు భాస్కర్, ఫకీర్ శ్రీనివాస్ రెడ్డి, కాసుల వెంకటేశం , చికూరి వెంకటేశం , ఉప్మాగుల నాగరాజు, సప్పిడి లింగారెడ్డి, పర్ణ శ్రీనివాస్ రెడ్డి,అమృతం దశరథ, పోలోజు భాస్కర్ చారి,బుడ్డ సురేష్,కడవేరి పాండు,ఇడుదల ఐలయ్య, ఓరగంటి భాను,వంగాల రమాకాంత్, కానుగు శేఖర్ , కానుగు కొండల్,ఇటుకల దామోదర్ రెడ్డి,గోపనగోని లింగస్వామి,బోల్లమోని శ్రీశైలం,చీకూరి సాయిరాం, గట్టు మొగులయ్య,చెరుకు సాయి,చిలువేరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నికైన నర్రాగిరి

- నర్రాగిరి తో పాటు అన్నెపు ప్రభును ఘనంగా సన్మానించిన పానుగంటి పర్వతాలు
- భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం పాటుపడతానన్న నర్రా గిరి



రాజేంద్రనగర్, ఏప్రిల్ 23(నగరనిజం ప్రతినిధి):భారత కమ్యూనిస్టు పార్టీ శంషాబాద్ మండల్ కార్యదర్శిగా కొనసాగుతున్న ఆ పార్టీ సీనియర్ నేత నర్రా గిరి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎంపికయ్యారు. శంషాబాద్ వేదికగా రెండు రోజులపాటు కొనసాగిన భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు ప్రకటించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన నర్రా గిరి తో పాటు, ఆ పార్టీ సీనియర్ నేత అన్నెపు ప్రభు ను బుధవారం నాడు పానుగంటి పర్వతాలు తో పాటు రాష్ట్ర నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ కి చెందిన నర్రా గిరి ప్రస్తుతం సీపీఐ శంషాబాద్ మండల కార్యదర్శి గానే కాకుండా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. అయితే గత రెండు రోజులుగా శంషాబాద్ వేదికగా జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం 4వ రాష్ట్ర మహాసభల సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీకి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు ప్రస్తుతం సీపీఐ మండల కార్యదర్శిగా కొనసాగుతున్న నర్రా గిరిని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎంపిక చేస్తున్నట్లు రాష్ట్ర నాయకత్వం ప్రకటించింది. అదేవిధంగా ఆ పార్టీ మరో సీనియర్ నేత అన్నెపు ప్రభు ను సైతం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో శంషాబాద్ లో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన నర్రా గిరి తో పాటు అన్నెపు ప్రభును జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు తోపాటు రాష్ట్ర నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నర్రా గిరి... భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా తనను ఎంపిక చేసినందుకు ఆయన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. తనకు అప్పగించిన బాధ్యతలతో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ప్రకటించారు.

# సార్వత్రిక సమ్మెకు సిద్ధం కండి - భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ

- కార్మిక శాఖలో బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్
- శంషాబాద్ లో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు తో కలిసి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నరసింహ మీడియా సమావేశం
- మే 28 న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు



రాజేంద్రనగర్, ఏప్రిల్ 23(నగరనిజం ప్రతినిధి):కార్మికుల కోర్కెల సాధన కోసం మే 28న దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు కార్మిక లోకం సన్నద్ధం కావాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నరసింహ తో పాటు జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. పోరాడితే పోయేది లేదు బానిస సంకెళ్లు తప్ప అనే నినాదంతో కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాలని వారు దిశా నిర్దేశం చేశారు. మరోవైపు కార్మికులకు గుది బండగా మారిన బయోమెట్రిక్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని గౌరవాధ్యక్షుడు నరసింహ తో పాటు జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ వేదికగా గత రెండు రోజులుగా జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాల్గవ మహాసభలు అట్టహాసంగా ముగిశాయి. ఈ నేపథ్యంలో బుధవారం నాడు శంషాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గౌరవ అధ్యక్షుడు ఎం నరసింహ తో పాటు జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు తదితర నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. గత ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం తెచ్చిన అనేక చట్టాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కుతోందని మండిపడ్డారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని నరసింహ తోపాటు పాలుగంటి పర్వతాలు విమర్శించారు. ప్రధానంగా లేబర్ అడ్డాల వద్ద కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికార యంత్రాంగం ఘోరంగా వైఫల్యం చెందిందని నరసింహ, పానుగంటి పర్వతాలు దుయ్యబట్టారు. పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాల నుండి వలస వస్తున్న వలస కార్మికుల బతుకులు దిన దిన గండం గా మారుతున్నాయని, ఈ నేపథ్యంలో వలస కార్మికుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ వారి సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా భవన నిర్మాణ కార్మికులకు పక్కా భవనాలు నిర్మించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే కార్మికులకు పెన్షన్ సదుపాయాన్ని కల్పించాలని ఎం నరసింహ తోపాటు పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. భవన నిర్మాణం పనులు ఆశాజనకంగా లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికుల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని, అందువల్ల కార్మికులకు నష్టపరిహారం కింద నేలకు కనీసం 15 రోజుల చొప్పున కనీస వేతనం చెల్లించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణాల సమయంలో అనుకోకుండా ప్రమాదాలకు గురయ్యే కార్మికులకు ప్రభుత్వం కార్మిక శాఖ తరపున చెల్లించే ఆరు లక్షల పరిహారాన్ని 10 లక్షలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయడంతో పాటు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు కళ్లెం వేయాలని నరసింహ, పానుగంటి పర్వతాలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కార్మిక సంక్షేమ బోర్డు నిధులు దారి మల్లకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి రూపొందించిన 22 తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు వారు మీడియాకు వెల్లడించారు. మరోవైపు 75 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు నరసింహ, పానుగంటి పర్వతాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆహ్వాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు, రాష్ట్ర కార్యదర్శులు కమతం యాదగిరి, మల్లికార్జున్, శివశంకర్, ఎస్ మల్లేష్, కోశాధికారి కన్య గారి నరసింహారెడ్డి, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు నర్రాగిరి(శంషాబాద్ మండల్ సీపీఐ కార్యదర్శి), అన్నపు ప్రభు, శంషాబాద్ మున్సిపల్ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కొవ్వొత్తి ర్యాలీ నిర్వహించిన జవహర్‌నగర్ బిజెపి శ్రేణులు

- పండలమహేశ్వరి గౌడ్ ఆధ్వర్యంలో.





జవహర్ నగర్ ఏప్రిల్ 23 ( నగర నిజం.న్యూస్ ):సైనిక దుస్తుల్లో వచ్చి కాల్పులు జరపడం అన్యాయం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి సీనియర్ నాయకురాలు పండల మహేశ్వరి గౌడ్ అన్నారు. బుధవారం నోబుల్ స్కూల్ దగ్గర నుంచి అంబేద్కర్ నగర్ వరకు కొవ్వొత్తి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉగ్రదాడి పరికిపందల చర్య అని ఈ దాడిలో పలువురు పర్యాటకులు మృతిచెందడం, మరికొందరు గాయపడటం కలిచివేసిందన్నారు. నాగరిక సమాజంలో ఉగ్రవాదానికి ఎట్టి పరిస్థితుల్లోనూ చోటు ఉండకూడదు అన్నారు. పర్యటకులపై కాల్పులు జరపడం అత్యంత సిగ్గుమాలిన, అవమానకరమైన చర్య ఇది ఒక చీకటి రోజు అని పహల్గాంలో జరిగిన దాడి మనల్నితీవ్రంగా కలిచివేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తూర్పు విభాగం బిజెపి సీనియర్ నాయకులు గిరి కత్తుల వెంకన్న, డాక్టర్ యాదగిరి, అనిల్ గుప్తా, శాగాఅనిల్, శ్రీనివాస్, వంశీ, తదితరులు బిజెపి కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జమ్మూకాశ్మీర్లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా మహల్గాం అమరవీరులకు నివాళులర్పిస్తూ భారీ ఎత్తున కొవ్వొత్తి ర్యాలీ నిర్వహించారు.



Edited & printed and owner,publisher aela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor aela purushotham.(H.O) : plot no:31,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE

# జమ్ము కాశ్మీర్ లో టూరిస్టుల పై జరిగిన ఉగ్రదాడిని ఖండించిన మహేశ్వరం బీజేపీ నేతలు.

- బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి క్లస్టర్ 1 క్లస్టర్ 2 అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి, రాముడి వీర కర్ణ రెడ్డి, ఆధ్వర్యంలో బడంపేట్ చౌరస్తాలో ఉగ్రవాదల దిష్టిబొమ్మలను దహనం చేసిన బీజెపి నేతలు.



బడంగ్పేట్ ఏప్రిల్ 23 (నగర నిజం)ఉగ్రవాదులు కేవలం హిందువులనే టార్గెట్ చేసుకొని కాల్చివేయడం దుర్మార్గమైన చర్య అని మహేశ్వరం కంటెస్టెడ్ ఎమ్మెల్యే,ఇన్చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.గాయాలు పాలైన వారు త్వరగా కోలుకోవాలని,చనిపోయిన వారి ఆత్మ శాంతించాలని ఆ భగవంతుని వేడుకున్నట్టు అందెల శ్రీరాములు యాదవ్ తెలిపారు.హిందువులు అంత ఐక్యంగా ఉండాలని మహేశ్వరం నియోజకవర్గంలో రోహింగలు నివసిస్తున్నారని వారిని ఇక్కడి నుండి తరిమి వేయాలని అన్నారు.ఉగ్రవాద ముసుగులో అమాయక ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బడంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకటరెడ్డి, సామ సంజీవరెడ్డి, గుర్రం మల్లారెడ్డి, మాజీ కార్పొరేటర్లు గౌర రమాదేవి శ్రీనివాస్, గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్, రామోజీ అమితా శ్రీశైలం చారి, చిత్రం శ్రీనివాస్, కళ్లెం లక్ష్మారెడ్డి, రేష్ నరసింహారెడ్డి, కొంతం ప్రకాష్ రెడ్డి, రావుల మల్లేష్, లాలా సందీప్, కుంటి భాస్కర్, జగదీశ్వర్ రాజు, బంగారు రా జు కుమార్, తీగల సురేందర్ రెడ్డి, దేశపాక జగన్, సామ సుధాకర్ రెడ్డి, అంకం గారి శ్రీనివాస్ గౌడ్, మంగపతి నాయక్, భువనచంద్ర, జి మల్లేష్, సైదులు, శశిధర్ రెడ్డి, మహేందర్, సతీష్ నంద, శ్రీనివాస్, పవన్ కుమార్, కిరణ్, నవా రోహిత్ రెడ్డి, తిరుమలేష్, ఉదయ్ బాలు, రాజేందర్ రెడ్డి, కృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా మోటే నరసింహ

- నూతన అధ్యక్షుడిగా మారగోని ప్రవీణ్ కుమార్
- 75 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్న రాష్ట్ర మహాసభ
- నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించిన జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు







రాజేంద్రనగర్, ఏప్రిల్ 23(నగరనిజం ప్రతినిధి):రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడిగా మోటే నరసింహ ఎన్నికయ్యారు. ఈ మేరకు 75 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి, ఆహ్వాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం నాడు శంషాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నూతన కార్యవర్గాన్ని పరిచయం చేశారు. రాష్ట్ర కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మోటే నరసింహ, అధ్యక్షుడిగా మారగోని ప్రవీణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా గన్నారపు రమేష్, ప్రధాన కార్యదర్శిగా పల్లా దేవేందర్ రెడ్డి ఎన్నికైనట్లు పానుగంటి పర్వతాలు మీడియాకు వివరించారు. అదేవిధంగా రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులుగా ఆకుల శ్రీనివాస్, గాదె లక్ష్మీనారాయణ, నూనె వెంకటేశ్వర్లు, జి పరమేష్, జి రాజు ఎన్నికైనట్లు తెలిపారు. మరోవైపు సహాయ కార్యదర్శులుగా కమతం యాదగిరి, ఎస్ మల్లేష్, పిట్టల సమ్మయ్య, వేల్పుల మల్లికార్జున్, కడారి రాములు, కే వెంకటేష్, ఎన్ శివశంకర్, కోశాధికారిగా కన్య గారి నరసింహారెడ్డి ఎన్నికైనట్లు పర్వతాలు ప్రకటించారు. మరో 75 మందిని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని చెప్పారు.

- **నూతన కమిటీకి ఘనంగా సన్మానం**

ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీకి నూతన గౌరవ అధ్యక్షుడిగా, అధ్యక్షుడిగా ఎన్నికైన వారితోపాటు కార్యవర్గాన్ని జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతుందని పానుగంటి పార్వతాలు ఆశాభావం వ్యక్తం చేశారు.


# పహల్గామ్ ఉగ్రదాడి తనను తీవ్రంగా కలిచివేస్తోంది షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ఆవేదన



షాద్నగర్ ప్రతినిధి ఏప్రిల్ 23 నగర నిజం పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తనను తీవ్రంగా కలిచివేస్తోందని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఈ దాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ పత్రిక ప్రకటన విడుదల చేశారు. "పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తీవ్రంగా కలిచివేస్తోందనీ ఈ దాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో ఐక్యంగా ఉందాం. మన భారత ఐక్యతను ఏ ఉగ్రవాదం విచ్ఛిన్నం చేయలేదు. ఇలాంటి దారుణాలు మరోసారి జరగకుండా చూడాలి. సమష్టిగా మనం దీన్ని అధిగమిద్దాం. కలిసికట్టుగా ఉందాం. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుంది" అని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ఆవేదనతో తెలిపారు. ఈ ఉగ్రదాడిని ఖండిస్తూ చనిపోయిన మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని తెలిపారు. ఉగ్రవాదులను అంతమొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# చేగిరెడ్డి ఘనపూర్‌లో శ్రీకోట మైసమ్మ విగ్రహ ప్రతిష్ట మహొత్సవ కార్యక్రమం హాజరైన ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి





షాద్నగర్ ప్రతినిధి ఏప్రిల్ 23 నగర నిజం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని చెగిరెడ్డి ఘనపూర్ గ్రామంలో శ్రీ కోట మైసమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమ మహొత్సవాలు జరుగుతున్నాయి. గత రెండు రోజులుగా కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం మహొత్సవంలో ఈరోజు దేవాలయంలో ఉదయము నుండి సుప్రభాతసేవ, ఆవాహిత దేవతాపూజ, హెూమములు, గర్తసంస్కారము, యంత్ర, విగ్రహ స్థాపన, తరుపరి బలి, పూర్ణాహుతి, బ్రహ్మకలుశ విసర్జన, ప్రోక్షణ, బస్మదారణ, వేదాశీర్వచనం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం అమ్మవారికి బోనాల కార్యక్రమం జరుగునున్నట్లు దేవాలయ కమిటీ ప్రకటించింది. విగ్రహ ప్రతిష్టాపన మహొత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి, హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ యాజమాన్యం ఆయనను సాదరంగా ఆహ్వానించి సన్మానించగా, విగ్రహ ప్రతిష్టాపన మహొత్సవ కార్యక్రమం సందర్భంగా జరుగుతున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు ఆయనను ప్రత్యేక వేదమంత్రోచ్చరణా లతో ఆశీర్వదించి, కోట మైసమ్మ అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి మాట్లాడుతూ దేవతా విగ్రహ ప్రతిష్టాపన వలన హిందూ సోదరులందరి మధ్య ఐక్యత భావం పెరుగుతుందని, భగవంతునిపై భక్తి కలుగుతుందని, తోటి మానవులపై ప్రేమ భావం కలుగుతుందని, అరిషడ్వర్గాలను జయించే మానసిక బలం భక్తులలో కలుగుతుందని, శ్రీ కోట మైసమ్మ కరుణ కృప కటాక్షాల వలన ప్రజలందరూ సుఖ సంతోషాలతో మెలగాలని, ఆయురారోగ్యాలతో సంపూర్ణ అభివృద్ధి సాధించాలని, అమ్మవారి ఆశీస్సులతో అందరూ భోగభాగ్యాలు అనుభవించాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్ మాజీ జెడ్పిటిసి స్వరూప రాములు,వెంకటేశ్వర్ రెడ్డి,జడ్పిటిసి తనయుడు రామక్రిష్ణ,మాజీ సర్పంచ్ లు మరియు నాయకులు మాదేవ్ పూర్ రవీందర్ రెడ్డి,బాబురావు,వజ్ర లింగం,శివ,మోహన్ రెడ్డి,నర్సిములు, ఉపసర్పంచ్ రాములు,జగన్ మోహన్ రెడ్డి,నర్సిములు,బాల్ రాజు, మోతిలాల్,గొల్ల యాదయ్య, యాదయ్య, కుమార్,గొల్ల నవీన్, మల్లేష్,కుర్వ రాజు తదితరులుపాల్గొన్నారు.

# నూతన గృహప్రవేశం పూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి



షాద్నగర్ ప్రతినిధి ఏప్రిల్ 23 నగర నిజం కొత్తూరు మండల పరిధిలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన జగదీశ్వర్ రెడ్డి శంషాబాద్ మున్సిపాలిటి ఊట్ పల్లి కేప్ టౌన్ కాలనీ లో జగదీశ్వర్ రెడ్డి నూతన గృహప్రవేశం పూజ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపిన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి.. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ ఉప సర్పంచ్ పిన్ని%శీ%టి హరిత మధుసూదన్ రెడ్డి, జయేంధర్ రెడ్డి, కన్హా, శ్రీధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# గిన్నిష్ రికార్డు సాధించిన హన్సిక ను అభినందించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్ జిల్లా నగర నిజం ఏప్రిల్ 24 (ప్రతినిధి ఎర్రమను బాలరాజు) మహబూబ్ నాగర్ పట్టణానికి చెందిన హెూంగార్డు సత్యం గౌడ్ పుష్పలత కుమార్తె చి.తోకల హన్సిక కూచిపూడి నృత్యం లో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించింది. బుధవారం నాడు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ని , హన్సిక తన తల్లి తో కలిసి క్యాంపు కార్యాలయంలో కలిసి, గిన్నిస్ బుక్ రికార్డు ను మరియు మెడల్ ను ఎమ్మెల్యే కి చూయించారు. ఈ సందర్భంగా కూచిపూడి లో గిన్నిస్ బుక్ రికార్డు సాధించినందుకు చిన్నారి హన్సిక ను శాలువా కప్పి ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి అభినందించారు. చదువులో సైతం మంచిగా రాణించాలని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి ఆయన ఆకాంక్షించారు.

# జమ్మూ కాశ్మీర్ పాల్గంలో టూరిస్ట్‌ల పై దాడిని ఖండించిన మీర్పేట బిజెపి నేతలు

- మీర్పేట్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు తులసి ముకేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కాండిల్ ర్యాలీ.






బడంగ్పేట్ ఏప్రిల్ 23 (నగర నిజం)జమ్మూ కాశ్మీర్ అనంత్ నాగ్ జిల్లా పహల్గామ్ లోని బైనారస్ లోయను సందర్శించడానికి వచ్చిన పర్యాటకుల పై హిందువులనే లక్ష్యంగా పెట్టుకుని ఉగ్రవాదులు జరిపిన దాడిలో 25 మందికి పైగా పర్యాటకులు మృతి చెందారు. ఈ సంఘటన లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు తులసి ముకేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించి వారికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ క్లస్టర్ 1 బిజెపి అధ్యక్షులు పసునూరి భిక్షపతి చారి, జిల్లా కౌన్సిల్ మెంబర్ సోమేశ్వర, జనరల్ సెక్రటరీ గాజుల మధు, జిల్లా అధికార ప్రతినిధి మద్ది రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు విజయ లక్ష్మి రాజు, భీమరాజు, ఎడ్ల మల్లేష్, సీనియర్ నాయకులు సుల ప్రభాకర్, సత్తయ్య, కాశీరాం, జగన్ ముదిరాజ్, గోపీనాథ్, సుధాకర్, రజిని గారు, సిద్దాల శ్రీనివాస్, తులసి మహేష్, శ్రీనివాస్ నాయక్, మల్లేష్, రంగారెడ్డి, వేణు గోపాల్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, ఆనంద్, ఉదయ్, మల్లికార్జున్, వరుణ్, రంగ గౌడ్, రవీంద్ర, రాఘవేందర్, నిఖిల్, భారత్, మహేష్, రాజు చారి, హరీష్, రాఖీ, రామ్, సురేష్ ఇతరులు పాల్గొన్నారు.

# జపాన్ నుండి హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి

- శంషాబాద్ విమానాశ్రయం వద్ద సీఎం రేవంత్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు
- 12 వేల కోట్ల పెట్టుబడి వస్తాయని అంచనా
- సీఎం పర్యటన నేపథ్యంలో శంషాబాద్ విమానాశ్రయం వద్ద గట్టి భద్రతా చర్యలు



రాజేంద్రనగర్, ఏప్రిల్ 23(నగరనిజం ప్రతినిధి):ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్ పర్యటనను ముగించుకొని బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. జపాన్ నుండి హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ మల్లు రవి తో పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, షాద్నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ తదితర కాంగ్రెస్ నేతలు శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. పెట్టుబడు లే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సారథ్యంలోని బృందం గత వారం రోజుల పాటు జపాన్ లో పర్యటించింది. జపాన్ పర్యటన సందర్భంగా సుమారు 12 వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు చేసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు జపాన్ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి బృందానికి ఘనంగా స్వాగతం పలకడానికి శంషాబాద్ విమానాశ్రయానికి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చారు. దీంతో శంషాబాద్ విమానాశ్రయం వద్ద పోలీసుల తో పాటు సిఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది గట్టి భద్రతా చర్యలు చేపట్టారు.

- **వాహనం దిగి.....కార్యకర్తలతో మమేకమై**

జపాన్ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఎయిర్ పోర్ట్ వద్దకు భారీగా చేరుకున్న కాంగ్రెస్ శ్రేణులను చూడగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రతను ఏమాత్రం లెక్కచేయకుండా స్వయంగా వాహనం దిగి కార్యకర్తలతో కరచాలనం చేస్తూ ముందుకు సాగారు.



# సీఎం రేవంత్ రెడ్డిని అభినందించిన కాంగ్రెస్ నేత నీరటి రాజు ముదిరాజ్

- శంషాబాద్ విమానాశ్రయం వద్ద సీఎం రేవంత్ కు పుష్పగుచ్ఛం అందించిన నీరటి రాజు



రాజేంద్రనగర్, ఏప్రిల్ 23(నగరనిజం ప్రతినిధి):జపాన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి శంషాబాద్ మండల్ మాజీ జెడ్పిటిసి నీరటి తన్విరాజు ముదిరాజ్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. జపాన్ పర్యటన ముగించుకుని బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి కాన్వాయ్ వాహనం దిగి స్వయంగా కాంగ్రెస్ నేతలు కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ మండల్ మాజీ జెడ్పిటిసి, కాంగ్రెస్ నేత నీరటి తన్వి రాజు ముదిరాజ్ సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. జపాన్ పర్యటనతో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని బృందం భారీ పెట్టుబడులను సాధించుకొని హైదరాబాద్ తిరిగి వచ్చినందుకు నీరటి తన్వి రాజు ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు.

# మహబూబ్ నగర్ ప్రజలందరికి గర్వపడేలా పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం

- త్వరలో నిర్మాణానికి శంకుస్థాపన ఏర్పాట్లు
- ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్ జిల్లా నగర నిజం ఏప్రిల్ 24(ప్రతినిధి ఎర్రమన్ను బాలరాజు) మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని ప్రజలందరూ గర్వపడేలా పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ఉంటుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ పట్టణం లోని ఆర్ అండ్ బి అతిథి గృహం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ. మహబూబ్ నగర్ పట్టణం నడిబొడ్డున ఉన్న ఆర్ అండ్ బి గెస్ట్ గా హౌస్ ప్రాంగణంలో గత ప్రభుత్వం వెజ్ నాన్ వెజ్ మార్కెట్ మార్కెట్ గా ఎలాంటి అనుమతులు లేకుండా అధికారుల పైన ఒత్తిడి తెచ్చి కొంత నిర్మాణం చేసి, మధ్యలోనే నిర్మాణపు పనులను ఆపివేశారని ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో విజ్ఞానాన్ని అందించే అధునాతన విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఉపయోగంగా ఉంటుందన్నారు. అందుకే గత 15 నెలలు గా ఎంతో మంది అధికారులను ఒప్పించి మెప్పించి ఈ నెల 16 వ తేదిన కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ గారు నాలెడ్జ్ సెంటర్ కోసం జీఓ జారీ చేశారని ఆయన తెలిపారు. నాలెడ్జ్ సెంటర్ కోసం 17 కోట్లు కేటాయించారని, ముందుగా 10 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. 17 కోట్లు రూపాయలతో ఇక్కడ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అంతర్జాతీయ స్థాయి లైబ్రరీ స్థాపిస్తామని, అందులో సెమినార్ హాల్స్, రీడింగ్ రూమ్స్, డిజిటల్ హాల్స్, క్లాస్ రూం లు తో ఒక మంచి అహ్లాదకరమైన వాతావరణం కల్పించి లక్ష పుస్తకాలు ఇక్కడ ఉండేవిధంగా అధునాతన లైబ్రరీ ఏర్పాటు చేయాలనే తన సంకల్పం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ కూడా విద్యకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం గ్రంథాలయం అంతర్జాతీయ స్థాయి గ్రంథాలయంగా ప్రజలకు అందుబాటులోకి రాబోతోంది అని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో కళాశాలు, పాఠశాలలు , కోచింగ్ సెంటర్లు, హాస్టల్స్ ఉన్నాయని, అందుకే విజ్ఞాన కేంద్రంగా ఈ ప్రదేశం అందరికీ ఉపయోగపడుతుంది అని ఆయన చెప్పారు. అలాగే మెట్టు గడ్డ ప్రాంతంలోని డైట్ కళాశాల ప్రాంగణంలో టిడి గుట్ట వెజ్ నాన్ వెజ్ మార్కెట్ గా నామకరణం చేసి అక్కడ నిర్మాణం చేస్తుంటే , విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఉద్యమాలు చేశారని, డైట్ కళాశాల స్థలం లో వెజ్ నాన్ వెజ్ మార్కెట్ ఏమిటి అని విద్యార్థులు ప్రశ్నించారని ఆయన గుర్తు చేశారు. అందుకే అక్కడ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. కోట్ల మంది భారతీయులకు స్ఫూర్తిని ఇచ్చిన వారు జ్యోతి బా పూలే , బాబా సాహెబ్ అంబేద్కర్ గారు అని, ఆంగ్లేయులు పరిపాలిస్తున్న కాలంలో దేశంలో కేవలం 5% అక్షరాస్యత ఉన్న సమయంలో తన ఆస్తులను అమ్మి 28 పాఠశాలలను ఏర్పాటు చేశారని , అలాగే దేశానికి రాజ్యాంగాన్ని అందించిన బాబా సాహెబ్ అంబేద్కర్ చదువు విలువ తెలిసిన వారని అందుకే వారి పేర్లను విజ్ఞాన కేంద్రానికి పెట్టడం జరిగింది అని ఆయన స్పష్టం చేశారు. త్వరలో ఈ పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రానికి శంకుస్థాపన చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, గుండా మనోహర్, శ్రీనివాస్ యాదవ్, మండల ఓబిసి సెల్ చైర్మన్ రాజు గౌడ్, దేవేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జమ్ము కాశ్మీర్ పహల్గంలో టూరిస్టులపై దాడిని ఖండించిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



దిల్సుఖ్నగర్ ఏప్రిల్ 23 (నగర నిజం)మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని స్థానిక కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్తపేటలో మెయిన్ రోడ్డు క్యాండిల్ ర్యాలీ లో పాల్గొన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదులు పిరికిపందలు వారికి మద్దతునిస్తున్న పాకిస్తాన్ ఒక పిరికిపంద దేశమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టికల్ 370 వచ్చిన తర్వాత జమ్మూ కాశ్మీర్ పర్యాటక ప్రాంతంగా మారిందని ఆల్ ఇండియా నుండి పర్యాటకులు అక్కడికి వెళుతూ ఆనందంగా గడుపుతున్నారని ఆయన తెలిపారు. ఈ మధ్యనే మా కుటుంబంతో పాటు ఎంపీలందరం అక్కడికి వెళ్లి ఎంతో సంతోషంగా గడిపామని ఇంతలోపే ఉగ్రవాదులు ఆ పర్యాటక ప్రాంతాన్ని చిన్నాభిన్నం చేశారని ఆయన ఆవేదన చెందారు. ఎట్టి పరిస్థితుల్లో ఉగ్రవాదులను పట్టుకుని తీరుతామని వారికి మద్దతునిస్తున్న వారిని వదిలిపెట్టమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంటెస్ట్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్, రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు పంతంగి రాజు భూపాల్ గౌడ్, బిజెపి సీనియర్ నాయకులు పేరాల శేఖర్ రావు, పెట్టే ఉపేందర్, రాములు, శ్రీనివాస్ గౌడ్, బడంగ్ పేట బిజెపి అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి, రామి డి వీర కర్ణ రెడ్డి, బడంగ్ పేట మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకటరెడ్డి, బచ్చిగల రమేష్, కొప్పు భాష, చింతల రాఘవేందర్, బిజెపి నాయకులు బీజేవైఎం నాయకులు యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

# పలు శుభకార్యాలలో పాల్గొని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన

- చేవెళ్ల -అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ బి కిషన్



మహబూబ్ నగర్ జిల్లా: నగర నిజం (ఏప్రిల్ 24 ప్రతినిధి ఎర్రమన్ను బాలరాజు) దేవరకద్ర నియోజకవర్గంలో కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో పలు శుభకార్యాలలో పాల్గొన్న బుధవారం నాడు ఆహ్వానం మేరకు వివాహ వేడుకకు మరియు ఎంగేజ్మెంట్ కార్యక్రమనికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రజల అభిమాన పోలీస్ అధికారి చేవెళ్ల అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ బి. కిషన్ ఆయనతోపాటు పాల్గొన్నవారు ఆయన అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# జమ్ము కాశ్మీర్ లో పర్యాటకుల మరణం పట్ల ఖండించిన

- ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి (జి ఎం ఆర్ )



మహబూబ్ నగర్ జిల్లా: నగర నిజం (ప్రతినిధి ఎర్రమను బాలరాజు)జమ్ము కాశ్మీర్ పహేల్గావ్ లో ఉగ్రవాదుల దాడిలో మంగళవారం రోజున పలువురు పర్యాటకుల మరణం పట్ల దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, సంతాపం ప్రకటించారు.పలు ప్రాంతాల నుండి కాశ్మీర్ సందర్శనకు వచ్చిన వారిలో 27 మంది పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపడం అమానవీయ చర్య అని విచారం వ్యక్తం చేశారు. తీవ్రవాదుల చర్యను ఖండించారు. మరణించిన వారి కుటుంబాలను ఆదుకుని అండగా నిలవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలనీ కేంద్రాన్ని కోరారు. జమ్ము కాశ్మీర్ లో టెర్రరిస్టుల మారణకాండ పునరావృతం కాకుండా కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు శోకతప్తులైన వారి కుటుంబసభ్యులకు దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి గారు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# జమ్మూ కాశ్మీర్ పాల్గంలో టూరిస్ట్లపై దాడిని ఖండించిన కొత్తూరు మున్సిపల్ చైర్మన్ లావణ్య దేవేందర్ యాదవ్, కౌన్సిలర్లు,





షాద్నగర్ ప్రతినిధి ఏప్రిల్ 23 నగర నిజం జమ్మూ కాశ్మీర్ అనంత్ నాగ్ జిల్లా పహల్గామ్ లోని బైనారస్ లోయను సందర్శించడానికి వచ్చిన పర్యాటకుల పై హిందువులనే లక్ష్యంగా పెట్టుకుని ఉగ్రవాదులు జరిపిన దాడిలో 25 మందికి పైగా పర్యాటకులు మృతి చెందారు. ఈ సంఘటన లో ప్రాణాలు కొత్తూరు గ్రామస్తుల ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించి వారికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కడంపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఈత గణేష్, మాజీ ఎంపీపీ వేణుగోపాల్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ డోలి రవీందర్, కొత్తూరు మున్సిపల్ కౌన్సిలర్లు మాదారం నరసింహ గౌడ్, కోస్గి శ్రీనివాస్, అనిత శ్రీనివాస్ గౌడ్, హేమ దేవేందర్ ముదిరాజ్, కొత్తూరు మాధవి గోపాల్ గౌడ్, కొత్తూరు మున్సిపల్ గ్రామస్తులు కటికే రాజు, శ్రీనివాస్, కొత్తూరు మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు ఎర్రవెల్లి నాగరాచారి, బిజెపి నాయకులు నరసింహ గౌడ్, జనార్ధన్ రెడ్డి, ఎండి ఆసియన్, పాల్గొన్నారు.

# పహల్గామ్ ఉగ్రవాదుల దాడుల చనిపోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం

- ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
- జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ



గద్వాల జిల్లా: నగర నిజం ఏప్రిల్ 24 (ప్రతినిధి ఎర్రమన్ను బాలరాజు) : పహల్గామ్‌లో మంగళవారం నాడు జరిగిన ఉగ్రదాడి తనను తీవ్రంగా కలిచివేస్తోందని జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ.అన్నారు. ఈ దాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ పత్రిక ప్రకటన విడుదల చేశారు.పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తీవ్రంగా కలిచివేస్తోందనీ ఈ దాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని పేర్కొన్నారు.ఈ క్లిష్ట సమయంలో ఐక్యంగా ఉందామని, మన భారత ఐక్యతను ఏ ఉగ్రవాదం విచ్ఛిన్నం చేయలేదని, ఇలాంటి దారుణాలు మరోసారి జరగకుండా చూడాలన్నారు..సమష్టిగా మనం దీన్ని అధిగమించి... కలిసికట్టుగా ఉందామని ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుంది” తెలిపారు. ఈ ఉగ్రదాడిని ఖండిస్తూ చనిపోయిన మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని తెలిపారు. ఉగ్రవాదులను అంతమొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

# పోట్లీ మహారాజ్ దేవాలయ నూతన కమిటి ప్రమాణ స్వీకారం

- ఆలయ చైర్మన్గా ప్రసాద్ గౌడ్
- ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి...



నగర నిజం తాండూర్ ప్రతినిధి ఏప్రిల్ 23::: వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గ దేవాలయాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. బుధవారం తాండూరు పట్టణంలోని శ్రీశ్రీశ్రీ పోట్లీ మహారాజ్ దేవాలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సమక్షంలో దేవాలయ చైర్మన్ గా ప్రసాద్ గౌడ్, సభ్యులుగా ఎస్. రాజ్ కుమార్, ఎ.నవీన్ కుమార్, ఎ.జగన్నాథ్, నీరటి సైదమ్మ ,కె. శ్రీనివాస్, ఎక్స్ ఆఫిషియో సభ్యులుగా కె. అనంత్ భట్టు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన పాలకవర్గం దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అన్నారు.దేవాలయ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలను అందిస్తానని అన్నారు.ఈకార్యక్రమంలో తాండూరు మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ స్వప్న పరిమళ్, మాజీ కౌన్సిలర్ విజయాదేవి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, కాంగ్రెస్ నాయకులు డా. సంపత్ కుమార్, భద్రేశ్వర దేవాలయాల చైర్మన్ పటేల్ కిరణ్ కుమార్. కాళికాదేవి దేవాలయ చైర్మన్ పి. బస్వరాజ్, నాయకులు పట్లోళ్ల నర్సింలు, మాజీ కౌన్సిలర్లు ప్రభాకర్ గౌడ్, సోమశేఖర్, గులి పరమేశ్వర్, లొంక నర్సింలు, నీరటి రామలింగం, కావలి సంతోష్, ఈఓ తాడెం నరేందర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ సద్గురు పోట్లీ మహారాజ్ దేవాలయ నూతన కమిటీకి సభ్యులకు



- శుభాకాంక్షలు తెలియజేసిన ఆర్బిఓఎల్ సీఈవో
- బుయ్యని శ్రీనివాసరెడ్డి

నగరనిజం తాండూర్ ప్రతినిధి ఏప్రిల్ 23 : వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని శ్రీశ్రీశ్రీ సద్గురు పొట్లీ మహారాజ్ దేవాలయ నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆర్బిఓఎల్ సిఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పాల్గొని, నూతన కార్యవర్గ చైర్మన్ ప్రసాద్ గౌడ్, సభ్యులు ఎస్ రాజ్ కుమార్, ఏ నవీన్ కుమార్, ఎ జగన్నాథ్, నీరటి సైదమ్మ, కే శ్రీనివాస్, ఎక్స్ అఫీషియో సభ్యులు అనంతభట్టులకు శుభాకాంక్షలు తెలియజేసి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోట్లీ మహారాజ్ దేవాలయ మాజీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Edited & printed and owner,publisher aela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor aela purushotham.(H.O) : plot no:31,kuntloor road,Near hayathnagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE

# తూప్రాన్‌లో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా భారీ ర్యాలీ

- రాజకీయాలకు అతీతంగా పాల్గొన్న హిందూవులు
- జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ ఉగ్రదాడి ఘటన కు నిరసన





మెదక్ బ్యూరో/ నగర నిజం: తూప్రాన్, ఏప్రిల్,23.మెదక్ జిల్లా తూప్రాన్ లో పాకిస్తాన్ కు వ్యతిరేకంగా హిందూ ధార్మిక సంస్థలు భారీ ర్యాలీ నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నేతలు హిందూవులు స్వచ్ఛందంగా పాల్గొని జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ ఉగ్రదాడి ఘటన కు నిరసన తెలిపారు. మంగళవారం జమ్మూ కాశ్మీర్లో హిందూ సోదరులపై జరిగిన క్రూరమైన సంఘటన నేపథ్యంలో బుధవారం సాయంత్రం తూప్రాన్ మహంకాళి దేవాలయం నుంచి చేతికి నల్ల రిబ్బన్ లు కట్టుకొని నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీలకు అతీతంగా హిందూ బంధువులందరూ ఏకమై నిరసన ప్రదర్శన లో భాగస్వాములయ్యారు. తూప్రాన్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ జీ.శివానందం ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూమన్నగారి జానకిరామ్ గౌడ్, శివ గౌడ్,బండారు దుర్గారాజు యాదవ్, స్వర్గం వెంకట నారాయణ, తాటి విఠల్, కే.వేణుగోపాల్, భాస్కర్, రామునిగారి మహేష్ గౌడ్, అర్.అశోక్ కుమార్ గౌడ్, ఆదేపు మధుసూదన్, బొంది రమేష్ గౌడ్, దోమలపల్లి ఆంజనేయులు, మామిండ్ల శ్రీశైలం, నాగులపల్లి సిద్ధిరాములు యాదవ్, పోల శ్రీనివాస్ గుప్త, కోడిప్యాక సంతోష్ గుప్త, పసుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హిందువులను కిరాతకంగా చంపినటువంటి ఇస్లామిక్ టెర్రరిస్టుల దుశ్చర్యకు నిరసనగా నల్ల బ్యాడ్జి లతో కోవొత్తుల ర్యాలీ



మెదక్ బ్యూరో/నగర నిజం: మనోహరాబాద్: కాశ్మీర్లోని పెహల్గాంలో 28 మంది హిందువులను కిరాతకంగా చంపినటువంటి ఇస్లామిక్ టెర్రరిస్టుల దుశ్చర్యకు నిరసనగా మనోహరాబాద్ మండల కేంద్రంలో నల్ల బ్యాడ్జి లతో కోవొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు బక్క వెంకటేష్ గౌడ్,రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్ గారు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కమ్మరి నరేందర్ చారి,మాజీ సర్పంచ్ ఐలయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్ సాదు సత్యనారాయణ, కొత్తూరి నర్సింలు, మండల సీనియర్ నాయకులు పాగాలా అజయ్, కొల్తూరి నరేష్ గౌడ్,కొత్తూరి మల్లేష్, హరిబాబు గౌడ్,కరాటే మల్లేష్, మామిళ్ళ ప్రణయ్, చాపల విజయ్, కిరణ్, రాజేష్ గౌడ్, శ్రీశైలం యాదవ్, రితీష్ ముదిరాజ్, ఎర్ర కృష్ణ, ఉసిరిక పల్లి రాజు, బాలకృష్ణ, కర్రె కనకరాజు, ప్రవీణ్ యాదవ్, పంది నవీన్, మంచి గిరీష్, కళ్లెం యాదగిరి, నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం భూ సమస్యల పరిష్కారానికి కీలకమైందని, రైతులు దీనిపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





మెదక్ బ్యూరో/నగర నిజం:మెదక్, 23 ఏప్రిల్ 2025 బుధవారం మాసాయిపేట మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి చట్టం-2025 అవగాహన సదస్సులో ఆర్డిఓ జై చంద్రారెడ్డి, తాసిల్దార్ జ్ఞాన జ్యోతి, ఏడిఏ రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొని,చట్టం మరియు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.ముందుగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు భారతి చట్టంపై ఆటపాటలతో అవగాహన కల్పించారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరు భూభారతి చట్టంపై సందేశం, రైతులకు వినిపించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి చట్టం రూపొందిం చిందన్నారు. ఎంతోమందిమేధావులు,అధికారులు భూభారతి చట్టానికి రూపకల్పన చేశారని వివరించారు. భూ పరిపాలన వ్యవస్థ అనేక దశల్లో అభివృద్ధి చెందిందని,గతంలో జరిగిన కొన్ని చట్టాలు, సర్వేలు, పాస్‌బుక్‌లు, ఆర్.ఓ.ఆర్ చట్టం వంటి చర్యలను గుర్తుచేశారు.ధరణి పోర్టల్‌లో లేని అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభించనున్నదని తెలిపారు.ఈ చట్టాన్ని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించారు.చట్టం రూపొందించే సమయంలో రైతుల సంక్షేమం కోసం వారి సమస్యలను ప్రస్తావించి,యు అభిప్రాయాలను చట్టంలో ప్రతిబింబించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. గతంలో ధరణి ద్వారా మన జిల్లా టాప్ 5లో ఉండగా,భూ భారతి చట్టంతో ప్రక్రియలు త్వరగా పూర్తి అవుతాయని తెలిపారు.ధరణిలో భూ సమస్యలపై దరఖాస్తు చేసుకునేందుకు 33 మాడ్యూల్స్ పొందుపరచారని, దీనివల్ల ఏ సమస్యకు ఏ మాడ్యూల్‌లో దరఖాస్తు చేయాలో రైతులకు అర్థమయ్యేది కాదని అన్నారు. భూభారతిలో 6 మాడ్యూల్స్ మాత్రమే ఉండి సులభమైన దరఖాస్తు ప్రక్రియ ఉంటుందని వివరించారు.భూ భారతి చట్టంలో తహసిల్దార్ స్థాయి నుండి సీసీఎల్ఏ స్థాయి వరకు సమస్యలను పరిష్కరించే అప్పీల్ వ్యవస్థను వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడిందని,భూమి రిజిస్ట్రేషన్,మ్యూటేషన్ ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. భూముల విస్తీర్ణం, మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని తెలిపారు.వార సత్వంగా వస్తున్న యజమానులకు పేరు మార్పులు చేయవచ్చని తెలిపారు.పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు.ఈ దరఖాస్తుల పై తహసిల్దార్ 30 రోజుల్లోగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకుంటారని అన్నారు.గడువు తర్వాత ఆటోమేటిక్ గా మూటేషన్ జరుగుతుందని అన్నారు.మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు చేస్తారని,దీని ద్వారా భూ ఆక్రమణలకు అవకాశం ఉండదని అన్నారు.గ్రామ స్థాయిలో సదస్సులు నిర్వహించి భూ సమస్యలు త్వరగా పరిష్కరించడానికి అవకాశం కల్పిస్తామన్నారు.భూ భారతి చట్టం మొదట రాష్ట్రవ్యాప్తంగా నాలుగు మండలాల్లో పైలెట్‌గా అమలవుతుందని,తరువాత ప్రతి జిల్లాలో ఒక్క మండలం నిర్వహించి,అవసరమైతే మార్పులు చేసి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తారని తెలిపారు.రాబోయే రోజులలో భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేస్తారని తెలిపారు.భూమి హక్కుల రక్షణకు భూ భారతి చట్టం ఉపయోగకరమైందని,రైతులు దీన్ని అర్థం చేసుకుని ఉపయోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# సీతారాంపేట హనుమాన్ దేవాలయ నూతన కమిటీకి సభ్యులకు

- శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి







నగరనిజం తాండూర్ ప్రతినిధి ఏప్రిల్ 23 ::: వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని సీతారాంపేట హనుమాన్ దేవాలయ నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే బియ్యని మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కార్యవర్గ చైర్మన్ భీమ లింగం, సభ్యులు ఎం నర్సింలు, బి నర్సింలు విశ్వనాథ్ భీ మంజుల డైరెక్టర్లుగా ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన హనుమాన్ దేవాలయం పాలకవర్గం ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, లింగంపల్లి రవికుమార్, నాయకులు గుళి పరమేశ్వర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్ గీతా

# విద్యార్థినిని అభినందించిన జిల్లా కలెక్టర్





మెదక్ బ్యూరో /నగర నిజం: తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో 470/468 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన గీతా కాలేజి విద్యార్థిని టి.కృతికను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తో పాటు ఆర్డీవో జయచంద్ర రెడ్డి అభినందించి భవిష్యత్తులో ఇటువంటి విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశానికి సేవ చేయాలన్నారు. ఇంతటి గొప్ప విజయాన్ని సాధించినందుకు విద్యార్థిని తల్లిదండ్రులతో పాటు కళాశాల యాజమాన్యం ,సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండల కేంద్రంలో కొత్త ఆర్‌ఓఆర్ చట్టం భూభారతిపై రైతు అవగాహన సదస్సు

- ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్





మెదక్ బ్యూరో/ నగర నిజం: సిద్దిపేట రైతుల వద్ద భూ సమస్యలు అడిగి తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కొత్త ఆర్ ఓ ఆర్ చట్టం భూ భారతి ద్వారా భూసమస్యల పరిష్కారం పై అవగాహన కల్పించిన అధికారులుసమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మను చౌదరి,అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్,సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ ,కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ లు తిరుపతి రెడ్డి, బోయిని నిర్మల తదితర అధికారులుమంత్రి పొన్నం ప్రభాకర్తెలంగాణ ప్రభుత్వం భూములకు సంబంధించి ధరణి చట్టం ద్వారా ఇబ్బందులు పడుతున్నారని లక్షల మంది పిటిషన్ పెట్టుకున్న ధరణి లొసుగులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన విధముగా కొత్తగా భూ భారతి చట్టాని తీసుకొచ్చాం..రాష్ట్రంలో ప్రతి మండలంలో భూ భారతి పై అవగాహన కల్పిస్తున్నాంరైతులకు భూ భారతి ద్వారా చట్టం అమలు చేస్తున్న వాటిపై అడిషనల్ కలెక్టర్ వివరణ ఇచ్చారుగతంలో తెల్ల కాగితాల పై రాసుకున్న కాగితాలు ,రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉన్నాయిఇప్పుడు భూముల ధరలు పెరిగిన తర్వాత ఒకరి భూమి ఇద్దరు రిజిస్ట్రేషన్ చేసుకోవడం.. రిజిస్ట్రేషన్ చేసిన చేయలేదనడం లాంటివి 2014 తరువాత జరిగాయిగ్రామాల వారిగా గతంలో రెవెన్యూ రికార్డులు ఉండేవిఎవరి భూమి ఎవరు కొనుక్కుంటున్నారు అని మొత్తం డీటెయిల్స్ రెవెన్యూ రికార్డుల్లో ఉండేవిప్రతి గ్రామంలో భూములకు సంబంధించినా సమాచారాన్ని గ్రామ రెవెన్యూ అధికారి ఉండాలని 10 వేల పోస్టుల నియామకం జరుగుతుందిరాష్ట్రంలో భూముల పంచాయితీ ఉండకూడదని ఈ నిర్ణయం తీసుకుందిమా తండ్రి గారి భూమి నా పేరుకు రాసుకోవడానికి కూడా రికార్డుల్లో కనిపించడం లేదుఈ చట్టం అమలు ద్వారా గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు లేకుండా హద్దులతో సహా అన్ని రకాల భూ వ్యవస్థకు ఒక పద్ధతిగా ఇది ఉపయోగపడుతుంది.భూ హక్కులపై ఆధార్ లాగ భూధార్ తీసుకొస్తున్నాంగ్రామాల్లో చదువులేకున్న భూముల పై అవగాహన ఉన్నవారు ఉంటారు.నిజాం ప్రభుత్వం నుండి ఇప్పటిదాకా భూ చట్టాలు ఏమున్నాయి అని ఉంది అందులో దరిద్రమైన చట్టం ధరణి.. దాని ద్వారానే సమస్యలు వచ్చాయి పరంపోగు భూములు ,ప్రభుత్వ భూములు తీసుకున్న వారి లెక్కలు తీయండి దానిని అభివృద్ధి కోసం వాడండి..హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎక్కడైనా ప్రభుత్వ భూమి కబ్జా చేశారు అంటే ప్రభుత్వం ఆ భూమి గుంజుకుంటుంది ..రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం ఆ భూములను తీసుకొని వాటిని అభివృద్ధికి వాడదాం మీకు భూములపై ఏమైనా సమస్య ఉంటే వచ్చి అడగండి సలహా ఇవ్వండిప్రజాస్వామ్యంలో అందరం భాగస్వామ్యులం.మీ అందరి భాగస్వామ్యంతో ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిందిమేము చెప్పిన అన్ని కార్యక్రమాలు చేస్తున్నాం.. కొంత ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి..ఇచ్చిన హామీలు అన్ని అమలు చేస్తాం..

# ఉగ్రవాదులను ఏరిపారేస్తుంది బిజెపి... ఖబర్దార్ పాకిస్తాన్ ఉగ్రవాదుల్లారా

- బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు చాకలి బందయ్య



చౌడాపూర్ మండల ప్రతినిధి ఏప్రిల్ 23(నగర నిజం):జమ్ము కాశ్మీర్ లోని అనంతనాగ్ జిల్లా పహల్గాంలో ఉగ్రవాదులు పంజా విసిరి పర్యాటకుల పై జరిగిన కాల్పుల ఘటనలో 20 మందికి పైగా దుర్మరణం పాలయ్యారని,ఎంతోమంది అమాయక పర్యాటకులు గాయపడ్డారని అంటూ ఖబర్దార్ ఉగ్రవాదుల్లారా బిజెపి ప్రభుత్వం మతోన్మాద ఉగ్రవాద కుక్కలను ఏరిపారేస్తుందని అంటూ బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు చాకలి బందయ్య హెచ్చరించారు.బుధవారం విడుదల చేసిన ప్రకటనలో చాకలి బందయ్య పేర్కొంటూ ఉగ్రవాదుల దుశ్చర్యతో ఒక్కసారిగా భయాందోళనలు నిలుపుకున్నయని పేర్కొన్నారు.పాహాల్గంలోని పైసరన్ వ్యాలీ ఎగువ ప్రాంతంలోని ఒక పర్యాటక రిసార్ట్ వద్ద ఈ దాడి జరిగిందని ఈ ప్రాంతానికి కేవలం కాలినడక లేదా ఉరల ద్వారా మాత్రమే చేరుకునే వీలుంటుదన్నారు.ఇలాంటి ప్రాంతంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు సైనిక తరహా దుస్తుల్లో వచ్చిన దుండగులు ఈ దాడికి తెగించారని పర్యాటకులను లక్ష్యంగా చేసుకొని పక్కా ప్రణాళికతోనే ఈ దాడికి పాల్పడ్డారని అంటూ పాకిస్తాన్ ఉగ్రవాద కుక్కలను బిజెపి ప్రభుత్వం విడిచి విడిచి పెట్టకుండా వారికి తగిన గుణపాఠం చెప్తుందని మరణించిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ చాకలి బందయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

# సన్న బియ్యం పంపిణీ హర్షణీయం..

- చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ శేఖర్..



**చౌడాపూర్ మండల ప్రతినిధి ఏప్రిల్ 23(నగర నిజం ):మండల పరిధిలోని చాకల్ పల్లి గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి ఆదేశానుసారం చాకల్ పల్లి మాజీ సర్పంచ్ రాములమ్మ శేఖర్,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ...పేద కుటుంబాల కడుపు నింపేందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని అంతేకాకుండా ప్రతి కుటుంబానికి కూడా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో ప్రారంభిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణ,శంకర్,వెంకటయ్య, చంద్రశేఖర్,చెన్నయ్య, విజయ్,బొక్క నర్సింలు,చెన్నయ్య,బాలరాజ్,లక్ష్మయ్య,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.**

# ఉగ్రవాదుల దాడి హేయం

- సరిత హాస్పిటల్ మేనేజ్మెంట్ వెంకట్ రాజ్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 23 నగర నిజం :ఉగ్రవాదులు అమాయకులను పొట్టన పెట్టుకోవడం అత్యంత బాధాకరమని వికారాబాద్ మున్సిపల్ రామయ్య గూడా ఎమ్ఐ జి కాలనీవాసి సరిత హాస్పిటల్ మేనేజ్మెంట్ వెంకట్ రాజ్ అన్నారు. జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో పర్యటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండించారు. ఉగ్రవాదుల దాడి ఘటనను అన్ని కోణాల్లో పరిశీలన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రవాదానికి బలి అయిన అమాయక కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి దాడులు చేయడం ఎంతో హేయమైన చర్య అని, ఈ దాడిలో అమాయకులు నిండు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఉగ్రవాద కిరాతకులను కఠినంగా శిక్షించాలన్నారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని ఆయన కోరారు. ఈ సమయంలో వాస్తవాలను పక్కదారి పట్టకుండా నిజాలని నిర్భయంగా వెలికి తీసి ఈ ఘటనకు కారణమైన ఉగ్రవాదులను అత్యంత కిరాతకంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదులు భారతీయులను చంపడమే లక్ష్యంగా వాళ్లు వచ్చినట్లు కనిపిస్తుందని దేశంలోకి అడుగు పెట్టి భారతీయ హిందువులను అత్యంత పాషవికంగా పంపిన ఉగ్రవాదని రూపుమాపాలని ఆయన కోరారు. దేశంలో ఇలాంటివి పునరావృతం కాకుండా, కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరు గొంతెత్తి నినాదించాలన్నారు. తప్పు చేసిన వారిని అణచివేయాలని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదులకు ప్రధాని నరేంద్ర మోడీ సరైన జవాబు చెప్పాలి అన్నారు. భారతదేశ దమ్మును వారికి చాటి చెప్పాలని ఆకాంక్షించారు.

## పోచంపల్లి అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభోత్సవం



ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 23 ( నగరనిజం ) : తుర్కయంజాల్ మున్సిపల్ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు అయిన పోచంపల్లి అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ ను ఆ బ్యాంక్ అధ్యక్షులు తడక రమేష్ ఆహ్వానం మేరకు రాష్ట్ర టిజీకాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య ముఖ్య అతిథిగా హాజరై బుధవారం బ్యాంక్ ను ప్రారంభించారు. అనంతరం బ్యాంక్ యొక్క లావాదేవీలు, లోనింగ్, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ భాగ్యమ్మ ధనరాజ్, సీనియర్ నాయకులు సామ భీంరెడ్డి, పోచంపల్లి బ్యాంక్ వైస్ చైర్మన్ రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు, బ్యాంక్ సీఈవో సీత శ్రీనివాస్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## -ఉగ్రవాదులకు గుణపాఠం తప్పదు - కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

### కాశ్మీర్ లో ఉగ్రవాదుల దుశ్చర్యను నిరసిస్తూ బిజేఆర్ ఆరాంఘర్ చౌరస్తా వద్ద ఉగ్రవాదుల బిజెపీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం





రాజేంద్రనగర్, ఏప్రిల్ 23(నగరనిజం ప్రతినిధి):పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులకు గుణపాఠం తప్పదని భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి అన్నారు. కాశ్మీర్ లో అభం శుభం ఎరుగని టూరిస్టులపై ఉగ్రవాదుల ముష్కర మూక పైశాచిక చర్యకు పాల్పడడం అత్యంత హేయనీయమైన ఘటన అని ఆయన మండిపడ్డారు. కాశ్మీర్ లో టూరిస్టులపై ఉగ్రవాదులు దాడిని నిరసిస్తూ బుధవారం నాడు రాజేంద్రనగర్ పరిధిలోని బాబు జగ్జీవన్ రామ్ ఆరాంఘర్ చౌరస్తా వద్ద భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి సారథ్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఉగ్రవాదుల దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి... నరేంద్ర మోడీ సారథ్యంలో భారతదేశం తిరుగులేని ఆర్థిక శక్తిగా అవతరించిందన్నారు. భారత్ తిరుగులేని శక్తిగా ప్రపంచ దేశాల సరసన నిలుస్తుండడంతో తట్టుకోలేక పాకిస్తాన్ ఉగ్రవాదులను ఉసిగొల్పుతో భారత్ పై దాడులకు తెగ పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాశ్మీర్ లో కుటుంబ సమేతంగా విహారయాత్రకు వెళ్లిన పర్యాటకులపై ఉగ్రవాదులు మారణకాండ సృష్టించడం దారుణం అన్నారు. ఈ ఘటనకు పాకిస్తాన్ మూల్యం చెల్లించుకోక తప్పదని కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. కాశ్మీర్ ఘటనకు ప్రతీకారం తీసుకోవడానికి కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని చెప్పారు.

## అమృత ఫుడ్ కోర్ట్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్



హయత్ నగర్/నగరనిజం: హయత్ నగర్ డివిజన్ లోని రాజప్పనగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన అమృత ఫుడ్ కోర్ట్ ప్రారంభోత్సవంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ , స్థానిక హయత్ నగర్ ,మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి గారు, కొప్పుల నర్సింహా రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ఫుడ్ కోర్ట్ ప్రారంభించడం జరిగినది. ఈ యొక్క కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా(అర్బన్) మాజీ అధ్యక్షులు సామ రంగారెడ్డి , అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ గారు,మల్కాజిగిరి పార్లిమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్ గారు, డివిజన్ బీజేపీ అధ్యక్షులు గంగాని శ్రీను , అధ్యక్షురాలు పర్వత గారు,ప్రధాన కార్యదర్శిలు సంఘీ అశోక్ గారు, గోవింద చారి గారు మరియు ఇతర నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తుర్కయంజాల్‌లో పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రారంభం



తుర్కయంజాల్ /నగరనిజం: తుర్కయంజాల్ గ్రామంలోకి వెళ్లే రోడ్డులో పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ను రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పోచంపల్లి బ్యాంకు చైర్మన్ తడక రమేష్, బ్యాంక్ మేనేజర్ రామచంద్రరావు, సీఈవో సీతా శ్రీనివాస్ మాట్లాడుతూ తమ పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో బంగారు ఆభరణములపై తక్కువ వడ్డీరేట్ల తో రుణ సౌకర్యం, హౌసింగ్ లోన్స్, వ్యాపార అభివృద్ధికి రుణాలు, ప్రాధాన్యత రంగాలకు రుణ సదుపాయం, ఓవర్ డ్రాఫ్ సదుపాయం, వాహన ఖరీదు కొరకు రుణ సదుపాయం వంటివి తమ బ్యాంకులో కలవన్నారు. తమ బ్యాంకు కస్టమర్ల కోసం అందించే సేవలను తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిసర ప్రాంతాల వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కేవలం 550 రూపాయలతో సేవింగ్స్ ఖాతా, ఏటీఎం కార్డుకు 1200 రూపాయలతో, కేవలం 3000 రూపాయలతో కరెంటు కాదా సదుపాయం తమ ప్రత్యేకత అన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు తమ బ్యాంకు సేవలు కస్టమర్లకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజేంద్రప్రసాద్, పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లు కర్నాటి వెంకట బాలసుబ్రమణ్యం, ఏలే హరి శంకర్, సూరేపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, కొండమడుగు ఎల్ల స్వామి, కో ఆప్షన్ డైరెక్టర్లు బిట్టు భాస్కర్,మక్తాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్జీటీఎల్ఎఫ్, టిపియుఎస్ ఆధ్వర్యంలో ప్రైవేట్ టీచర్స్ కమిషన్ యాక్ట్ అమెండ్మెంట్ బిల్ డ్రాఫ్టింగ్ కమిటీ నియామకం







కొత్తపేట్/నగర నిజం : నాన్ గవర్నమెంట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ (ఎన్జీటీఎల్ఎఫ్), తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఉపాధ్యాయ సంఘం (టిపియుఎస్) సంయుక్త ఆధ్వర్యంలో ప్రైవేట్ టీచర్స్ కమిషన్ యాక్ట్ అమెండ్మెంట్ బిల్ డ్రాఫ్టింగ్ కమిటీ ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీకి చైర్మన్ అండ్ నేషనల్ కన్వీనర్ గా డాక్టర్ విజయకుమార్ సింగ్, వైస్ చైర్మన్ గా సిహెచ్. సందీప్ రావు, ఓవర్సీఆర్ మొహమ్మద్ మోయిజ్, జనరల్ సెక్రటరీగా క్రాంతి కుమార్ రెడ్డి, ట్రెజరర్ గా వెంకటేష్ దౌత్రీ, మహిళా విభాగ్ ప్రెసిడెంట్ గా సునీత దౌత్రీ ని నియమించడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ కమిషన్ బిల్ పార్లమెంట్లో ఆమోదం తెలిపితే ప్రైవేట్ టీచర్లకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రైవేట్ టీచర్లు పడుతున్న కష్టాలను పరిష్కరించే దిశగా వారి సంక్షేమం కొరకు ఈ కమిటీని ఏర్పాటు చేశామని అన్నారు. ఈ బిల్ ఆమోదం తెలిపితే ప్రైవేట్ టీచర్లకు మంచి గుర్తింపు వస్తుందని అప్పుడు ప్రభుత్వ టీచర్లు, ప్రైవేట్ టీచర్లు సమానత్వంగా సమాజంలో గుర్తింపబడతారని అన్నారు. ఇలాంటి ప్రతిపాదన ప్రపంచంలోనే ఎక్కడ కూడా చేయలేదని ముఖ్యంగా భారతదేశ చరిత్రలో ఇది మొదటిగా మేమే ప్రైవేట్ టీచర్ల కష్టాలను గుర్తించి ఈ డ్రాఫ్టింగ్ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ టీచర్లకు అందరికీ ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. దీని భవిష్యత్ కార్యచరణ త్వరలో అమలు చేస్తామని, వివిధ జిల్లాల్లో కార్యాలయాలు ప్రారంభించి అందరి టీచర్ల సమస్యలను తెలుసుకొని ఆ తర్వాత వివిధ రంగాల్లో ఉన్నత పదవుల్లో ఉన్న వారి అభిప్రాయాలను సేకరించి ఎంపీ, ఎమ్మెల్యేలకు తెలియజేస్తామని అన్నారు. ఈ బిల్లు తప్పకుండా ఆమోదం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకవేళ కాకపోతే మేం దేనికైనా సిద్ధంగా ఉంటామని తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులకు ఘన సన్మానం చేసి నియామక పత్రాలు అందజేశారు.






Edited & printed and owner,publisher aela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, printed y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,rangareddy-Dist,TELANGANA-500074, Editor aela purushotham.(H.O) : plot no:31,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE